# భగవంతుని కృప

రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# భగవంతుని కృప



**రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి**

మొదటి ముద్రణ : అక్టోబరు, 2026
ప్రతులు : 1,000

**వెల : రూ. 50/-**

**పుస్తకముల కొరకు :-**
**తటవర్తి వీరరాఘవరావు,**
**తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.**
**సెల్ : 94901 71853, 9440309812**

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహాస్మి" నుంచి "అహం బ్రహ్మాస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్టత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 22) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 23) దుఃఖానికి కారణం | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం | - | రూ.50/- |
| 32) భగవంతుని కృప | - | రూ.50/- |
| 33) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 34) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 35) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

# భగవంతుని కృప

సాధకులకు మొదట ఉండవలసింది ఈశ్వరుని కృప, అంటే భగవంతుని కృప. భగవంతుని కృప ఉంటేనే మీరు ఈ ధ్యాన మార్గంలోకి రాగలరు. మన పూర్వీకులు చెబుతూ ఉండేవారు "శివుడి ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు" అని. అంటే శివుడి ఆజ్ఞ ఉంటేనే చీమ హాని చేస్తుంది, లేకపోతే చేయదు అని చెప్పేవారు.

మీరు అందరూ సాధన చేస్తున్నారు, జ్ఞానాన్ని పొందుతున్నారు. అయినా ఇంకా ఇంకా నేర్చుకోవాల్సి ఉంది. అయితే ఈ నేర్చుకునే విధానంలో అయినా మీకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండాలంటే ఈశ్వర అనుగ్రహం ఉండాలి. మరి ఆ విధంగా ఈశ్వరానుగ్రహం మీపై ఎప్పుడు ఉండాలి అంటే, ఈ సాధన మార్గంలో మీరు ఇంకొంచెం జాగ్రత్తగా మీ వాక్కు, ప్రవర్తనను ఉంచాలి.

మొట్టమొదట మీకు ఉండాల్సింది "నేను" అనే అహంకారాన్ని పోగొట్టుకుని వినయంగా వుండాలి. ఎవరి పట్ల వినయంగా ఉండాలి అంటే పరమాత్మ పట్ల, ప్రకృతి పట్ల, గురువు పట్ల మీరు వినమ్రతతో ఉండాలి. ఆ వినయం లేకుండా "నేను" అనే అహంకారంతో ఉంటే, మీరు ఈ మార్గంలో చివరి వరకు కొనసాగలేరు. మీ ప్రయత్నం ఎంత చేసినా సాధించలేరు.

మీరు మొదటి మెట్టు నుంచి ఇంకా ఎన్నో మెట్లు ఎక్కాలి, మోక్షాన్ని చేరుకోవాలి. మొట్టమొదటి మెట్టు సేవ. మీలో అహంకారం ఉంటే మీరు సేవ చేయలేరు, వినయం ఉంటేనే మీరు సేవ చేస్తారు. మీలో ఎన్నో మార్పులు ఆ సేవ వల్ల జరుగుతూ ఉంటాయి. ఎందుకంటే గురువు చెబుతారు "అందరూ ఆత్మ స్వరూపులే" అని. మరి మీరు విధేయంగా ఉండి అందరికీ సేవ చెయ్యాలి, "సర్వ జీవుల సేవే సర్వేశ్వరుని సేవ" అని తెలుసుకోవాలి. భగవంతునికి

సేవ చేయడం అంటే అన్ని జీవులలోనూ భగవంతుడు ఉన్నాడని తెలుసుకుని అన్ని జీవులకు సేవ చేస్తే ఆ దేవుడికి సేవ చేసినట్లే అని మీరు తెలుసుకోవాలి. అందరికీ సేవ చేయడమే మీ వినయానికి మొదటి మెట్టు.

సృష్టిలో ఏ జీవికి లేని బుద్ధి, తెలివి మానవుడికి ఇవ్వబడ్డాయి.

సృష్టిలో ఎన్నో రకాల జీవులను సృష్టించిన భగవంతుడికి తృప్తి కలగలేదట. ఆఖరులో మానవుడిని సృష్టించి, అతనికి తెలివి, బుద్ధి ఇచ్చిన తర్వాత, తాను చేరవలసిన గమ్యాన్ని చేరగలిగేది మానవుడు ఒక్కడే అని తెలుసుకున్నప్పుడు భగవంతుడికి తృప్తి కలిగిందట. కానీ ఈ మానవుడికి మానవ జన్మ వచ్చిన వెంటనే తన ప్రయత్నం భగవంతుని వైపు కాకుండా ప్రపంచమే శాశ్వతం అనుకుని, ఈ శరీరం శాశ్వతం అనే అజ్ఞానంలో ప్రాపంచిక కోరికల్లోనే మునిగి, 300 నుంచి 400 జన్మల వరకు వాటి కోసమే పాటుపడుతూ ఉంటాడు. “శరీరమే నేను” అని అనుకోవటమే అహంకారం, అది ఉన్నంతకాలం మీ దృష్టి బాహ్య దృష్టిగానే ఉంటుంది, అంతర్ దృష్టి రాదు.

బాహ్య దృష్టి ఉన్నప్పుడు భగవంతుని అనుగ్రహం మానవులపై ఉండదు. ఆ బాహ్య దృష్టిని అంతర్దృష్టిగా మార్చినప్పుడే భగవంతుని అనుగ్రహం ఉంటుంది. ఎందుకంటే బాహ్య దృష్టి ఉన్నప్పుడు మీ మనసు స్వార్థంతో, ఈర్ష్యతో, అసూయతో నిండి ఉంటుంది. అరిషడ్వర్గాలు మీ మనసును ఆవరించి ఉంటాయి. అప్పుడు మీ మనసు అశుద్ధంగా ఉంటుంది. అశుద్ధంగా ఉన్న మనసు కారణంగా మీ బుద్ధి కూడా అదే విధంగా అశుద్ధంగా ఉంటుంది.

కాబట్టి మనసును శుద్ధత్వం వైపు మళ్ళించడానికే మొదట సేవా మార్గం, ప్రేమ మార్గం, త్యాగం ఈ మూడు విషయాలను గురువులు శిష్యులకు బోధించి, వారి మనసును శుద్ధత్వం వైపు నడిపిస్తూ ఉంటారు. బాహ్యంగా

తిరిగితే మనసు అశుద్ధం అవుతుంది. అంతర్ముఖంగా తిరిగినప్పుడు శుద్ధత్వాన్ని పొందుతూ ఉంటుంది. అందుకే చూడండి, ఎవరైనా సరే సేవా మార్గంలో ఉన్నవారు భగవంతుడు కచ్చితంగా ఉన్నాడని విశ్వసిస్తారు. "భగవంతుడు ఉన్నాడో, లేడో" అనే మాటను వారు మాట్లాడరు. భగవంతుడు ఉన్నాడు, ఆయనే చేయిస్తున్నాడు అనే జ్ఞానం వారికి ఉంటుంది. ప్రాపంచిక జీవితంలో ఈ జ్ఞానం వారికి తెలియకపోయినా, వారు ఎప్పుడైతే సేవ, ప్రేమ మొదలైనవాటిని పాటిస్తూ ఉంటారో, వారి జీవితంలోకి సద్గురువు ద్వారా ఈ విషయాలన్నీ చెప్పించబడతాయి.

ఏం చెప్పించబడుతుంది అంటే సృష్టిలో మీరు ఒక్కరే ప్రాణి కాదు, కోటానుకోట్ల ప్రాణులు ఉన్నాయి. మరి అన్ని జీవులలోనూ ఆత్మగా భగవంతుడే ఉన్నాడు, జీవులలోనే కాదు, సృష్టి అంతా తానే ఉన్నాడు. భగవంతుని చైతన్యంతోనే ఈ సృష్టి నడుస్తుంది" అని చెబుతారు. మరి ఇది మీరు తెలుసుకోవాలంటే భగవంతుని బాహ్యంగా వెతకడం కాదు, అంతరంలో ఉన్న ఆత్మను తెలుసుకోవాలి. మరి ఈ ఆత్మను తెలుసుకోవాలి అంటే, శరీరాన్ని కూడా శుద్ధత్వంలో ఉంచుకోవాలి. అందుకే మొట్టమొదట ఆహార నియమాలు చెబుతారు. అతిగా ఆహారం తీసుకుంటే అంతర్ముఖంగా వెళ్ళలేరు.

అందుచేత మితాహారమే మనిషికి సరైన ఆహారం. మీకు ఎంత హితకరమైన ఆహారం అయినా, అంటే ఎంత ఆరోగ్యకరమైన ఆహారం అయినా, మితంగానే తీసుకోవాలి. సాధకుడు శాకాహారాన్ని మితంగానే తీసుకోవాలి.

అలాగే మిత భాషణం అంటే తక్కువగా మాట్లాడాలి, వీలైనంత వరకు మౌనం పాటించాలి. మౌనంగా ఉండడం ఎందుకు అంటే మీరు ఎంత మౌనంగా ఉంటే మీలో అంత పరిశీలనా శక్తి పెరుగుతుంది. మీరు వడ వడా మాట్లాడుతుంటే అవతలి వాళ్ళు ఏమి చెబుతున్నారో కూడా మీకు

అర్థం కాదు. మీరు ఎంత మౌనంగా ఉంటే అంత మీ పరిశీలనా శక్తి పెరుగుతుంది. ఎదుటి వాడు ఎలాంటి వ్యక్తి అనేది గ్రహించే శక్తి మీలో పెరుగుతుంది.

అలాగే నిద్ర కూడా మితంగానే ఉండాలి. మరి ఇవన్నీ మీరు అలవాటు చేసుకోవాలి. మితంగా తినాలి, మితంగా మాట్లాడాలి, మితంగా నిద్రపోవాలి.

మరి అజ్ఞాని ఎలా ఉంటాడు అంటే, అతిగా తినడం, అతిగా నిద్రపోవడం  ఇవి అజ్ఞాని లక్షణాలు. మరి జ్ఞాని మిత భోజనం చేస్తాడు, హిత భోజనం చేస్తాడు, హితం కానిది తినడు. అందుకే పత్రి గారు పాపాహారమైన మాంసాహారాన్ని అందరి చేత మానిపించారు. ఇంకొకటి, శరీరానికి హాని కలిగించే వెల్లుల్లి, మష్రూమ్స్ వంటి కొన్ని ఆహార పదార్థాలు కూడా సాధనలో కూర్చోనివ్వకుండా చేస్తాయి, రజోగుణాన్ని పెంచుతాయి. కాబట్టి వాటిని కూడా మానేసి మిత నిద్ర, మిత భాషణం, మితాహారం, హితాహారం  శరీరానికి హితం చేసేది  ఇలా మీరు తీసుకుని సరైన సాధన చేయడానికి శరీరాన్ని, మనసును సిద్ధపరచాలి. అలాగే ఎక్కువ మాట్లాడకుండా మనసును నియంత్రించాలి. అప్పుడు మీరు సరైన సాధనను సరిగ్గా చేయగలుగుతారు.

మరి సాధన చేస్తూ "అందరూ ఆత్మ స్వరూపులే" అని గురువు దగ్గర మీరు తెలుసుకున్నారు. అంతకు ముందు మీరు భగవద్గీత చదివారు, పెద్దల మాటలు విన్నారు. కానీ "నేను" అనే దానికి ప్రాముఖ్యం ఇచ్చి మీరు ఎన్నో లేనివి తగిలించుకున్నారు. అంటే  నాకు డబ్బు ఉంది, రూపం ఉంది, చదువు ఉంది అని రకరకాల మదాలను పెంచుకున్నారు. కానీ అందరూ ఆత్మ స్వరూపులే అని మీరు తెలుసుకోలేకపోయారు.

ధ్యానం దగ్గరికి వచ్చాక, మీకు భగవంతుని పై భక్తి ఉండి, ఆయనను

ఎలా చేరుకోవాలో దారి తెలియక అస్తవ్యస్తమైన స్థితిలో ఉన్నప్పుడు, భగవంతుడే తన అనుగ్రహంతో ఒక సద్గురువును పంపి సత్యాన్ని చెప్పించాడు. ఆయన కృపతోనే ఇది జరిగింది. ఈ కృపను మీరు నిలబెట్టుకోవాలి. అంటే మీరు ధ్యాన మార్గంలోకి వచ్చారు. మరి ఇందులో వదలకుండా, ఆటంకాలు వచ్చినా ఆగిపోకుండా, చిట్ట చివరి వరకు నిలబడాలి. ఎందుకంటే ఇక్కడ ఎన్నో కర్మలు వస్తూ ఉంటాయి, ఈ జన్మలు చివరివైనప్పుడు మీరు ఎక్కువ కర్మలను అనుభవించాల్సి వస్తుంది.

అప్పుడు అయ్యో, ధ్యానంలోకి వచ్చాము, మాకు ఇన్ని కష్టాలు వస్తున్నాయి, పూజలు చేసినప్పుడైతే కష్టాలు లేవు అని కొంతమంది జ్ఞానాన్ని కూడా వదిలేసే వాళ్ళు ఉన్నారు. ఎందుకు అంటే, గురువు దగ్గర సరైన జ్ఞానం తెలుసుకోకుండా వున్నప్పుడు అలా చేస్తారు. ధ్యానం అంటే భగవంతుని చేరే మార్గం అని తెలుసుకున్నప్పుడు, మీ ప్రతి కష్టం ఎందుకు వచ్చిందో కూడా మీరు తెలుసుకోవాలి. సరైన జ్ఞానం ఉన్నవాడు “కష్టం ఎందుకు వస్తుంది?” అని ఆలోచిస్తాడు. కర్మ పని చేస్తే కష్టం వస్తుంది, మరి కష్టాలు వస్తున్నాయి అంటే కర్మలు పోతున్నాయని అర్థం.

కర్మలు ఉన్నంతకాలం మీరు ఎంత సాధన చేసినా, ఎంత జ్ఞానం పొందినా, మీ చివరి జన్మను పూర్తి చేసుకోలేరు. కాబట్టి కర్మలన్నీ ఖర్చవుతున్నాయి అని అర్థం చేసుకుంటే, ఎవ్వరూ జ్ఞానాన్ని వదలరు. కష్టాలు ఉన్నా భరిస్తారు. భగవంతుడు మానవుడికి ఏ జీవికి ఇవ్వని తెలివి, బుద్ధి ఇచ్చాడు. తెలివి మనసుకు సంబంధించినది, మరి బుద్ధి జ్ఞానం కోసం. ప్రాపంచిక తెలివిని సంపాదించుకోవడానికి మనసు ఉంది. మరి ఏది మంచి, ఏది చెడు, ఏది చెయ్యాలి? ఏది చెయ్యకూడదు అని తెలుసుకునేది బుద్ధి. అందుకే మీరు సత్ప్రవర్తనలో ఉన్నప్పుడు, సత్శీలం అలవాటు చేసుకున్నప్పుడు,

నీతిగా, నిజాయితీగా బ్రతకగలిగినప్పుడు జ్ఞానాన్ని చక్కగా పొందుతారు. సాధన కూడా ఏ ఆటంకాలు లేకుండా సాగుతుంది.

అనుక్షణం ఎరుకలో ఉండాలి. నేను చేసే సాధన భగవంతుని చేరడానికి. కాబట్టి ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని నష్టాలు వచ్చినా, చిట్ట చివరికి నా ప్రయాణం ఆగిపోకూడదు అనే గట్టి నిర్ణయం వుంటే ఎన్ని కష్టాలు వచ్చినా మీరు సాధనను ఆపరు. అటువంటి నిర్ణయం మీరు తీసుకున్న రోజున భగవంతుని కృప తప్పకుండా ఉంటుంది. ఎన్ని ఆటంకాలు వచ్చినా, ఆ ఆటంకాల నుంచి కూడా బయటపడగలిగేంత ధీరత్వం మీలో ఉంటుంది. కష్టాలు కష్టాలే, కానీ సాధన సాధనే. ఎన్ని కష్టాలు వచ్చినా ఆపకుండా ముందడుగు వేయాలి. అది వీరుల లక్షణం. కష్టాలకు కుంగిపోయి, కష్టాలకు పారిపోతే యుద్ధంలో వెనుక చూపించిన వాడిలా అవుతారు. మరి ఎన్ని కష్టాలు వచ్చినా మీరు ముందుకే వెళ్తూ ఉంటే, అప్పుడు కచ్చితంగా భగవంతుని కృప మీ పై ఉంటుంది.

గీతలో కూడా భగవంతుడు "మీరు ఒక అడుగు నా వైపు వేస్తే, నేను పది అడుగులు మీ వైపు వేసి మిమ్మల్ని అందుకుంటాను" అనే భావాన్ని చెబుతారు. మరి మీరు ఎన్ని కష్టాలు వచ్చినా ఈ సాధనను ఆపకుండా, మీ చుట్టూ ఎన్ని ప్రలోభాలు ఉన్నా వాటికి ఆశపడకుండా, మీరు నీతిగా, నిజాయితీగా బ్రతకగలగాలి. మీ చుట్టూ ఎన్నో రకాల ప్రలోభాలు ఉంటాయి. అవి మిమ్మల్ని మోహంలో పడేస్తాయి. "పర్వాలేదు, ఒక్కసారి అనుభవిస్తే తప్పేంటి? పర్వాలేదు, ఒకసారి తింటే తప్పేంటి? ఒకటి తీసుకుంటే తప్పేంటి?" అని మీరు ఆలోచిస్తారు. ఇలా "తప్పేంటి? తప్పేంటి?" అని ప్రశ్నిస్తున్నారంటే ఇంకా మీరు మనసు ప్రభావంలో ఉన్నారని అర్థం. బుద్ధిలో జ్ఞానం ఇంకా పూర్తిగా నిండి పోలేదని అర్థం.

ఒక్కసారి తప్పు చేయడానికి మీ మనసు అంగీకరిస్తే, ఆ ఒక్క తప్పే మిమ్మల్ని వంద తప్పులు చేయడానికి పురికొల్పుతుంది. ఒక్క ఇంజిన్ చాలు, దాని ద్వారా రైలు బోగీలన్నీ కదులుతాయి. అలాగే మన మొదటి తప్పు ఒక ఇంజిన్ లాంటిది. ఆ ఒక్క తప్పు చేసేటప్పుడు మీరు పదే పదే ఆలోచించుకోవాలి "ఈ ఒక్క తప్పే నన్ను మళ్ళీ జన్మకు కారణం అవుతుంది" అని వివేకంతో విచారణ చేసుకుంటూ ఆ తప్పు చేయకుండా ఉండేంత నిగ్రహ శక్తిని పెంచుకోవాలి. మీ మనసు ఇంకా తప్పు చేయమని ప్రోత్సహిస్తుంటే, మీరు ఇంకా శరీర సుఖాల కోసం "ఈ శరీరమే నేను" అనే అభిప్రాయంతో ఉన్నారని అర్థం.

ఇది కాదు కదా నాకు గురువు చెప్పింది, "నేను శరీరం కాదు కదా, నేను ఆత్మను" అని పదే పదే గుర్తు చేసుకోవాలి. "నేను ఆత్మనైతే, దైవాన్నైతే, ఈ దొంగతనం చేయాలి, ఈ కోరికలు తీర్చుకోవాలి అనే అభిప్రాయం నాకు ఎందుకు కలిగింది?" అని మీకు మీరు ప్రశ్నించు కోవాలి. అంటే మీరు ఇంకా మనోస్థితిలో ఉన్నారు, శరీర స్థితిలో ఉన్నారు అని మీకు మీరే అర్థం చేసుకోవాలి. అలా అర్థమైన రోజున, మీ ప్రయాణం ఎలా ఉన్నా మీరు తప్పు చేయరు. అందుకే బుద్ధుడు చెబుతాడు తప్పు చేసేటప్పుడు ఒకటికి పది సార్లు ఆలోచించుకోండి. ఈ తప్పే మిమ్మల్ని జన్మ పరంపరలో పడేస్తుంది. అందుకే తప్పు చేయడానికి ముందు మీకు విచారణ ఉండాలి. ఒక్క క్షణం మీరు బలహీనమయ్యారంటే తప్పుకు కారణం అయిపోతుంది.

అందుకే ప్రాపంచిక జీవితంలో ఇవన్నీ చెప్పేవాళ్ళు మీకు ఉండరు. ఎలా కావాలంటే అలా బ్రతికేశారు. కానీ ఆధ్యాత్మిక జీవితంలో సద్గురువులు నిరంతరం మీకు వెన్నుతట్టి ముందుకు నడిపిస్తారు. అందుకే సద్గురువులను మించిన దైవం భూమిమీద ఎవ్వరూ ఉండరు. ఈరోజు మీరు గమనించుకుంటే,

పత్రి గారు మీ జీవితంలోకి రాకముందు మీరు ఎలా ఉండేవారు? ఆయన మీ జీవితంలోకి వచ్చాక మీ ప్రవర్తన ఎలా ఉంది? ఇప్పుడు ఎంతసేపూ "నా భర్త, నా పిల్లలు, నా చుట్టాలు, నా బంధువులు" అనే ఒక పరిమిత ప్రేమతో మీరు కుంచించుకుపోయి ఎన్నో తప్పులు చేశారు. కానీ ఈరోజు మీ ప్రేమ పరిమితమైన ప్రేమగా ఉండకూడదు.

సృష్టిలో అన్ని జీవులూ ఆత్మ స్వరూపులని గురువు నోటివెంట విన్నాక, ఎవ్వరూ పరాయివారు కారు అని మీరు తెలుసుకోవాలి. అందరూ సత్యలోకం నుంచి, పూర్ణాత్మ నుంచి భూమిమీదకు వచ్చి అనుభవాలు పొందుతూ, పాఠాలు నేర్చుకుంటూ, ఎదుగుతున్నారు అని మీరు అర్థం చేసుకోవాలి. మానవ జన్మ యొక్క పర్పస్ కూడా మీరు తెలుసుకుని, "ఇది నా చివరి జన్మ చేసుకోవాలనే భగవంతుడు నా జీవితంలోకి ఒక సద్గురువును పంపి నాకు సాధనను తెలియపరిచారు" అని ఎవరికి వారు అనుకోవాలి.

అయితే భగవంతుని అనుగ్రహం చిట్ట చివరి వరకు మీపై ఉండాలి అంటే, మీరు ఏ చిన్న ప్రలోభానికీ లొంగకూడదు. అరిషడ్వర్గాలు మీ అదుపులో ఉండాలి కానీ మీరు అరిషడ్వర్గాలకు బానిస కాకూడదు. మీరు ప్రతి క్షణం ఈ అరిషడ్వర్గాల్లో ఏదైనా మిమ్మల్ని బానిసగా చేసుకుందా అని ఎప్పటికప్పుడు విచారణ చేసుకోవాలి. ఎందుకంటే తెలియకుండానే అవి మీ మనసును ఆవరించి ఉంటాయి. అవే మిమ్మల్ని భగవంతునికి దూరం చేస్తాయి. ఈ అరిషడ్వర్గాలకు మీరు బానిస కాకుండా ఉంటే భగవంతుని దగ్గరకు తొందరగా చేరగలరు. దానికి ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ వుండాలి.

మీరు కంటితో ఏది చూసినా మొదట ప్రలోభాలు వస్తాయి. అందుకే శంకరాచార్యులు అంటారు "మీరు చూసింది, విన్నది ఏదైనా సరే, అది ఆత్మ వల్లే వచ్చింది" అని తెలుసుకోవాలి. అందమైనది ఏదైనా చూసినప్పుడు ఇది

నాకు కావాలి అని అనిపిస్తుంది, కానీ మీరు ఆలోచించాలి, దీనిని సృష్టించినవాడు ఎంత గొప్పవాడు. నేను చేస్తున్న సాధన అటువంటి గొప్పవాడి దగ్గరకు నన్ను చేరుస్తుంది. మీరు ఎప్పటికప్పుడు విచారణ ద్వారా ఆలోచిస్తే మీ మనసు చలించే తత్వాన్ని కూడా దాటేస్తుంది. దేన్ని చూసినా చలించరు.

ఎందుకంటే విచారణ ద్వారా మీరు తెలుసుకున్నారు. "నేను చూస్తున్నది కొంచెమే, కానీ సృష్టికర్త దగ్గర అనంతంగా ఉంది. నేను అందుకోసమే సాధన చేస్తున్నాను" అని. అనుక్షణం ఎరుకతో మీరు ఉండి సాధన చేస్తుంటే, ఏది చూసినా చలించని మనస్తత్వం మీకు అలవాటు అవుతుంది, అప్పుడు స్థిరత్వం మీలో వస్తుంది, ఏది చూసినా మీరు చలించరు. ఎందుకంటే మీరు మూలాన్ని వెతుకుతున్నారు.

మీకు కనిపించే చెట్టుకు మంచి కాయ లేదా మంచి పండు కనిపించినప్పుడు, "అది తింటే బాగుండు, ఈ పువ్వులు పెట్టుకుంటే బాగుంటుంది" అని మీరు అనుకోవచ్చు. కానీ అంత అద్భుతంగా, అంత రుచిగా సృష్టించిన భగవంతుని దగ్గర ఇంకా ఎన్ని ఉన్నాయో! ఆయన దగ్గర ఉన్న ఆ అనంత తత్వాన్ని తెలుసుకోవడం కోసం నేను అన్వేషిస్తున్నాను అని మీరు ఎప్పటికప్పుడు అనుకుంటే, ఒక్క చెట్టుకున్న ఒక్క కాయను చూసి మీరు చలించిపోరు. ఈ సృష్టిలో ఇలాంటి రుచులు, ఇలాంటి అందాలు ఎన్నో ఉన్నాయి. ఆయన్ని తెలుసుకుంటే అన్నీ సొంతమవుతాయి అని మీరు అర్థం చేసుకున్న రోజున, ఏది చూసినా మీరు ప్రలోభానికి లొంగరు. ఏ ప్రలోభానికీ లొంగని వాడే పరమాత్మను చేరుకోగలడు.

అందుకే భగవంతుడు మీ చుట్టూ ఇన్ని అందాలను సృష్టించి పెట్టాడట. దేనికి మీరు లొంగిపోతారు? దేనికి మీరు బానిస అయిపోతారు? ఏది కావాలి అని మీరు కోరుకుంటారు? అని చూస్తాడట. ఇవన్నీ గురువులను

పంపి సత్యాన్ని చెప్పిస్తాడు. చుట్టూ అన్నీ పెడతాడు. మీరు "ఇది వద్దు" అని అనలేరు. "ఇది కావాలి" అని కోరుకుంటే మళ్ళీజన్మ వస్తుంది.

చూడండి, సాధకుడి జీవితం ఎంత కష్టమో! అన్నీ ఉన్నా, అన్నింటినీ చూస్తూ, వీటన్నిటికీ మూలమైన భగవంతుడి మీద మీ దృష్టిని ఎంతగా నిలుపుతారో, అంతగా మీరు ఆయనకు దగ్గరవుతూ ఉంటారు. ఆయన అనుగ్రహాన్ని పొందుతూ ఉంటారు. అందుకే ఆయన అనుగ్రహాన్ని ఎలా పొందాలి అంటే, మీ చుట్టూ ఉన్న వాటిపై మీరు ఆశ కానీ, కోరిక కానీ పెంచుకోకుండా, ఈ సృష్టి చూపించే అద్భుతాల కంటే సృష్టికర్త ఇంకా గొప్పవాడు అని అనుక్షణం విచారణలో, ఎరుకలో ఉంటూ, చలించని మనస్తత్వాన్ని అలవాటు చేసుకుంటే, మీరు ఏ ప్రలోభాలకూ లొంగకుండా మీ దృష్టిని భగవంతుని మీదే పెడితే, ఆ భగవంతుని కృప తప్పకుండా మీపై ఉంటుంది. మీరు ధ్యానంలో ఇంకా పురోగతి సాధిస్తూ ఉంటారు.

అందుకే అంతరంలో 'ఆత్మ' మీద దృష్టి, బాహ్యంలో సృష్టి మీద దృష్టి ఉండాలి. మీకు అంతరంలో ఎప్పుడైనా మీ అంతర్ముఖ ద్వారం తెరిచి ఉన్నప్పుడు 'ఆత్మ' మీదే దృష్టి ఉండాలి. "నేను ఆత్మను, నేను ఆత్మను, సృష్టిలో సర్వ జీవులూ ఆత్మ స్వరూపులే" అనే భావం ఉండాలి. బాహ్యంలో అందరూ వేరుగా కనిపించినా, మీరు చూస్తున్న ప్రతి ఒక్కరూ ఆత్మ స్వరూపులే అనే దృష్టి మాత్రం మీలో నుంచి పోకూడదు.

అప్పుడు నిరంతరం మీ దృష్టి భగవంతుని మీదే ఉంటుంది, భగవంతుని కృప, ఈశ్వర అనుగ్రహం మీకు తప్పకుండా కలుగుతుంది. గురువు అనుగ్రహం, భగవంతుని అనుగ్రహం, ప్రకృతి అనుగ్రహం ఇవన్నీ రావాలి అంటే మీరు కచ్చితంగా సేవ, ప్రేమ, త్యాగం, నీతి, నిజాయితీ వంటి లక్షణాలన్నింటినీ అలవరచుకోవాలి. మీరు ఏది చూసినా చంచల స్థితికి లోనుకాకుండా, నిశ్చలంగా ఉండి, సాధనను కొనసాగించాలి.

# ఆధ్యాత్మిక యోగం అంటే?

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవితంలోకి వచ్చిన తర్వాత ఎదగాలని కోరుకుంటారు. అయితే ఎదగాలని కోరుకున్నప్పుడు, మిమ్మల్ని వెనక్కి లాగేది ఏమిటి? మీరు ఆధ్యాత్మికంగా ఎదగకుండా చేసేది ఏమిటి? అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆధ్యాత్మిక జీవితంలోకి రావడం అంటే ఆధ్యాత్మిక యోగంలోకి రావడం. శంకరాచార్యులు చెప్పిన ప్రకారం, ఈ ఆధ్యాత్మిక యోగం అంటే బాహ్యంలో ఉన్న మీ దృష్టిని అంతరంలోకి తిప్పడం. అంటే బాహ్య విషయాల వైపు ఉన్న మీ మనసును అంతరంలోకి మళ్లించడం.

బాహ్యంలో ఉన్నప్పుడు మీ మనసు భిన్నత్వంలో ఉంటుంది, అంతరంలోకి వచ్చినప్పుడు మీ మనసు ఏకత్వంలోకి వస్తుంది. అందుకే బాహ్యంలో ఉన్న మనసును అంతరంలోకి మళ్ళించడాన్నే ఆధ్యాత్మిక యోగం అని శంకరాచార్యులు చెబుతారు. మరి బాహ్యంగా వుంటే నష్టం ఏమిటి? అంతరంలోకి వస్తే లాభం ఏమిటి? అనే విషయాన్ని మీరు తెలుసుకుందాం.

బాహ్యంగా ఉన్నప్పుడు మీ మనసు కలుషితంగా ఉంటుంది. ఎందుకంటే అది ప్రాపంచిక విషయాల్లో మునిగిపోతుంది. రాగద్వేషాలు, కామ క్రోధాలు, అహంకార మమకారాలు, ఈర్ష్య, అసూయ, లోభం, మోహం వీటన్నింటితో మీ మనసు నిండిపోయి, దాని పవిత్రత తగ్గిపోయి కలుషితంగా ఉంటుంది.

రాగద్వేషాలు అంటే ఏమిటి? బయట తిరిగే మీ మనసుకు తన వాళ్ళంటే అనురాగం ఉంటుంది, తనకు నచ్చని వాళ్ళపై ద్వేషం ఉంటుంది. అలాగే మీరు ఏదైనా కోరుకుంటారు. ఆ కోరిక తీరకపోతే క్రోధం వస్తుంది. మీకు లేక ఎదుటి వారికి ఉంటే ఈర్ష్య కలుగుతుంది. మీ కంటే గొప్ప వాళ్ళను చూసినప్పుడు అసూయ కలుగుతుంది. అలాగే లోభం, మోహం కూడా మనసును కలుషితం చేస్తాయి. కొంత మందికి తన దగ్గర ఉన్నది ఖర్చయి

పోతుందేమో అనే భయం వల్ల లోభం ఉంటుంది. తన డబ్బుపై, తన వస్తువులపై, తన సంబంధాలపై ఇలా రకరకాల మమకారాలు, ఆసక్తులు పెంచుకుంటారు. ఈ విధంగా బాహ్యంలో తిరిగినప్పుడు మీ మనసు రకరకాల విషయాలతో కలుషితమై ఉంటుంది.

మరి ఇలా ఉంటే ఏమవుతుంది? ఈ ద్వంద్వాలతో ఉన్న మనసు ఎప్పుడూ దుఃఖంగానే ఉంటుంది, సుఖశాంతులు ఉండవు. వారి జీవితంలో ఎప్పుడూ ప్రశాంతత ఉండదు. శాంతి లేని మనసు సత్యాన్ని గ్రహించలేదు. అందుకే మీరు కూడా జీవితంలో "ఎప్పుడు నాకు శాంతి లేదు, సుఖం లేదు, సంతోషం లేదు" అని అనుకుంటూ ఉంటారు.

ఎప్పుడైతే మీరు అంతర్మథనానికి లోనవుతూ ఉంటారో, అప్పుడు భగవంతుడు కరుణామయుడు కాబట్టి మీ జీవితంలోకి ఒక గురువును పంపిస్తాడు. ఆ గురువు ద్వారా "బాహ్యంలో ఎవరికీ శాశ్వతమైన శాంతి దొరకదు, అంతరంలోనే నిజమైన ప్రశాంతత ఉంటుంది" అని మీకు తెలియజేసి, మీ దృష్టిని అంతరంలోకి తిప్పుతాడు.

అప్పుడు మీకే అర్థమవుతుంది ఆత్మ దగ్గరకు చేరాలంటే ప్రాపంచిక విషయాల మురికి మీ మనసులో ఉండకూడదని. ఏది మురికి? ఏది తప్పు? అనే విషయం మీకు అర్థమవుతుంది. ప్రపంచంలో ఉన్న విషయాలన్నింటినీ మీ మనసులో పోసుకున్నారు. ఇప్పుడే మీరు చెప్పుకున్నట్లుగా ఈర్ష్య, అసూయ, కామం, క్రోధం, లోభం, మోహం వంటి వాటన్నింటినీ మనసులో పోసుకుని, మీ మనసును స్థూలంగా తయారు చేసుకున్నారు. అంటే మీ మనసు బరువుగా మారిపోయింది. ఎన్నో విషయాలు మనసులో ఉండటం వల్ల అది స్థూలంగా తయారై, శాంతి లేక మీరు పరితపిస్తున్నప్పుడు, గురువు ద్వారా "బాహ్య ప్రపంచంలో మీకు శాశ్వతమైన సుఖశాంతులు ఎప్పుడూ దొరకవు. ఆత్మ దగ్గరే అంతులేని ఆనందం ఉంది" అని తెలుసుకుంటారు.

మీరు అంతర్ముఖులైనప్పుడే, అంటే ఆత్మ యోగంలో ప్రవేశించినప్పుడే ఆ ఆనందాన్ని అనుభవించగలరు. ధ్యానం ద్వారా ఇది జరుగుతుంది. యోగసిద్ధి వల్ల ఇది సాధ్యమవుతుంది. యోగం అంటే కలయిక. ఏ కలయిక? మనసు ఆత్మతో కలవడం. ఇదే యోగం. ఈ కలయిక ధ్యానం ద్వారా జరుగుతుంది. మీ మనసును బాహ్య విషయాల వైపు తిప్పినప్పుడు అది స్థూలంగా మారుతుంది. అదే మనసును ఆత్మ వైపు తిప్పినప్పుడు అది సూక్ష్మంగా మారుతుంది. ఎందుకు ఆత్మ వైపు తిప్పినప్పుడు మనసు సూక్ష్మంగా అవుతుంది అంటే, మీరు మీలో ఉన్న ఒక్కొక్క అశుద్ధతను, ఒక్కొక్క కోరికను, ఒక్కొక్క బంధాన్ని క్రమంగా వదులుకుంటూ వస్తారు. “ఆత్మ అంటే భగవంతుడే” అని మీ అందరికీ తెలుసు. మరి మీరు భగవంతుని చేరుకోవాలంటే, మీలో ఈ మురికి ఉండకూడదు అని గురువు ద్వారా తెలుసుకున్న తర్వాత, వాటిని ఒక్కొక్కటిగా వదులుకుంటూ ఉండాలి.

ఇప్పుడు ప్రతి ఒక్కరికీ ఆత్మ దర్శనం కలగడం లేదు. మీరు ఎన్ని రోజులు సాధన చేసినా, మీలో ఇప్పటివరకు చెప్పుకున్న ఈ మురికి కొంతవరకు అలాగే ఉండి ఉండవచ్చు. అది పోయిందని మీరు అనుకోవచ్చు, దాన్ని పోగొట్టుకోవాలని తెలుసు. కానీ నిజంగా అది పూర్తిగా పోయిందో లేదో మీకు తెలియదు. ఎందుకంటే మీకు ఇంకా ఆత్మ దర్శనం కలగలేదు కాబట్టి ఈ మురికి ఇంకా పూర్తిగా తొలగిపోలేదని మీరు అర్థం చేసుకోవాలి. అంటే మీ మనసు ఇంకా పూర్తిగా సూక్ష్మంగా మారలేదు. ఇంకా అది స్థూలంగానే ఉంది అని మీకు అర్థమవుతుంది. అందుకే సాధనలో కేవలం రోజులు గడపడం మాత్రమే కాదు, మీలో ఉన్న రాగద్వేషాలు, కామక్రోధాలు, లోభమోహాలు, అహంకారమమకారాలు, ఈర్ష్య, అసూయ మొదలైనవి ఎంతవరకు తగ్గుతున్నాయి అనే విషయాన్ని కూడా మీరు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలి. మనసు ఎంత శుద్ధమవుతుందో, అంతగా అది సూక్ష్మమవుతుంది. మనసు

సూక్ష్మమవుతున్న కొద్దీ మీ దృష్టి బాహ్యం నుంచి అంతరం వైపు తిరుగుతుంది, అదే మీ ఆధ్యాత్మిక ఎదుగుదలకు నిజమైన సూచన.

మీరు ఆత్మనే ధ్యానించినప్పుడు, ఆత్మ మీదే దృష్టి పెట్టినప్పుడు, ఆత్మదర్శనం కావాలి అని అనుకున్నప్పుడు, మీరు ఇంతకుముందు చెప్పుకున్న ఆ ప్రాపంచిక విషయాలన్నింటినీ క్రమంగా ఆటోమేటిక్‌గా వదిలేస్తూ ఉంటారు. భిన్నత్వం నుంచి ఏకత్వానికి రావడమే ఆధ్యాత్మిక యోగం అని మీరు గురువు ద్వారా తెలుసుకున్నారు. అంటే ప్రాపంచిక విషయాల్లో తిరిగినప్పుడు మీ మనసు భిన్నత్వంలో ఉంటుంది. ఆత్మ వైపు తిరిగినప్పుడు మీ మనసు ఏకత్వంలోకి వస్తుంది. ఏకత్వం అంటే ఏమిటి? ఉన్నదంతా ఆత్మే. సర్వ జీవులలోనూ ఉన్నది ఆత్మే. సృష్టి అంతా ఆత్మమయమే. ఇదే ఏకత్వంలోకి రావడం. మీరు దేహాలను చూసి వేర్వేరుగా అనుకుంటారు. జీవులను, జీవరాశులను బాహ్య రూపాలను చూసి వేర్వేరుగా భావిస్తారు. కానీ ఇవన్నీ ఒకే ఆత్మశక్తి వల్ల నడిపించబడుతున్నాయి అని ఎప్పుడైతే మీరు తెలుసుకుంటారో, అప్పుడు మీరు కూడా ఆత్మస్వరూపులే అని అర్థమవుతుంది. ఈ ఆత్మకు మరణం లేదు, మరణం దేహానికే. ఈ విషయాలను మీరు తెలుసుకున్నప్పుడు, అంతా ఆత్మమయమే అని అర్థమైనప్పుడు, ఇక బాహ్యంగా ఉన్న వాటిని మీరు ఏమి కోరుకుంటారు?

మీకు కోరిక ఉంటేనే ఇవన్నీ వస్తాయి. కాబట్టి మీరు ద్వంద్వాలకు అతీతులుగా కావాలి. బంధాలకు, కోరికలకు అతీతులుగా కావాలి. ఇవన్నీ కూడా ఆత్మమయమే, సృష్టి అంతా ఆత్మమయమే అని మీరు తెలుసుకున్నప్పుడు, ఇక దేనిపైనా కోరిక ఉండదు. మనిషికి కోరిక వల్లే అన్ని బంధాలు, బాధలు వస్తాయి. మరి అవి ఎప్పుడు పోతాయి అంటే "నేను ఆత్మను" అనే ఎరుకలో మీరు ఉన్నప్పుడు అవి క్రమంగా తొలగిపోతాయి. మరి "నేను ఆత్మను" అనే ఎరుక ఎప్పుడు స్థిరమవుతుంది? మీరు బాహ్యంలో తిరిగినప్పుడు అది స్థిరంగా

ఉండదు. మీ మనసు అంతరంలోకి మళ్ళినప్పుడే ఆ ఎరుక స్థిరమవుతుంది. అప్పుడు మీరు ఏ బాధలకూ లోను కాని స్థితికి ఎదుగుతారు.

చూడండి, బాహ్యంలో తిరిగినప్పుడు మీరు కర్మలు చేస్తూ ఉంటారు, కర్మఫలాలను అనుభవిస్తూ ఉంటారు. కొన్ని పుణ్య కర్మలు ఉంటే భోగాలు వస్తాయి, పాప కర్మలు ఉంటే రోగాలు వస్తాయి. ఈ రెండింటినీ కొంతకాలం దుఃఖంతో, కొంతకాలం సంతోషంతో అనుభవిస్తూ, ఇంకా "నేను జీవుడిని" అని అనుకుంటూ ఉంటారు.

మీరు బాహ్యంలో ఎంతగా తిరుగుతారో, అంతగా "నేను జీవుడిని, నేను జీవుడిని" అనే భావంలో ఉంటారు. కానీ మీరు అంతరంలోకి తిరిగినప్పుడు, త్రి కాలాలకు ప్రభువైన ఆత్మను నేనే అని తెలుసుకున్నప్పుడు, ఇక దేనికీ బాధపడరు. అప్పుడు మీ స్థూల దృష్టిని క్రమంగా సూక్ష్మ దృష్టిగా మార్చుకుంటారు. మరి బాహ్యంగా తిరిగినప్పుడు, జ్ఞానం లేనప్పుడు, మానవుడు పాపాలు చేస్తూనే ఉంటాడు. మరి ఈ పాపాలు ఎందుకు చేస్తున్నాడు? సత్యం తెలియక. సత్యం తెలియనప్పుడు పాపాలు చేస్తూ ఉంటాడు. మరి దేహంలో ఉన్న వాసనల వల్ల, కారణ దేహంలో ఉన్న వాసనల వల్ల కూడా పాపాలు చేస్తాడు. వాసనలు ఎందుకు ఏర్పడ్డాయి? బాహ్యంగా ఉన్న మనసు కోరికలతో నిండిపోవడం వల్ల అవి వాసనలుగా ఏర్పడి, మనిషిని ప్రేరేపిస్తూ ఉంటాయి. దాని వల్ల మనసు దానికి సంబంధించిన ఆలోచనలు చేస్తూ ఉంటుంది.

ఎప్పుడైతే మనసు ఆలోచనలు చేస్తుందో, బుద్ధి వాటిని చేయాలని నిర్ణయిస్తుంది, అలా కర్మలు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. మీరు బాహ్యంలో తిరిగినప్పుడు ఎక్కువ కర్మలు చేస్తూ ఉంటారు. కానీ మీరు అంతరంలోకి వచ్చినప్పుడు, అంటే ఆత్మ దగ్గరకు చేరినప్పుడు, మీ దృష్టిని బాహ్యం నుంచి అంతరంలోకి మళ్లించినప్పుడు, మీరు కర్మలను క్రమంగా తగ్గిస్తూ ఉంటారు; కర్మబంధానికి లోనుకాకుండా ఉంటారు. మీరు జీవించి

ఉండగానే ముక్తస్థితి, ఆనందకరమైన స్థితి రావాలంటే, ప్రతి ఒక్కరూ మానవ జన్మ తీసుకున్న తర్వాత ఆత్మ యోగంలోకి ప్రవేశించాలి. అప్పుడు శరీరం, మనసు, బుద్ధి ఇవన్నీ చక్కగా పనిచేసి, శరీరాన్ని సాధనకు ఉపయోగించు కుంటారు. మనసులో సత్సంకల్పాలు ఉంటాయి. బుద్ధిలో జ్ఞానాన్ని పెంచుకుంటూ ఉంటారు.

ఎవరైతే బాహ్యంగా తిరిగి, “నా జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు లేవు” అని బాధపడుతున్నారో, అలాంటి ప్రతి ఒక్కరూ ఆత్మ యోగంలోకి ప్రవేశించినప్పుడే కేవలం సుఖం, సంతోషం మాత్రమే కాదు, వాటికంటే గొప్పదైన ఆనంద స్థితిని పొందగలరు. భూమిమీద జన్మ తీసుకున్న ప్రతి మానవుడికీ ఈ ఆనందస్థితిని పొందే అవకాశం ఉంది. ప్రతి మానవజన్మకూ ఈ ఆనందాన్ని పొందే అవకాశం ఉంది.

కానీ అది ఎందుకు తెలియడం లేదు? సత్యాన్ని తెలుసుకునే అర్హత ఇంకా ఏర్పడకపోవడం వల్ల. ఇప్పుడు చూడండి, తమోగుణంలో ఉన్నవాళ్ళు కానీ, రజోగుణంలో ఉన్నవాళ్ళు కానీ, ఎంత చెప్పినా వారికి ధ్యానం గురించి నమ్మకం కలగదు. మీరు ధ్యానం గురించి ఎంత మాట్లాడినా వారికి అర్థం కాదు. దీనికి కారణం ఆ వ్యక్తి తప్పు కాదు. వారి మనసులో ఉన్న గుణాన్ని బట్టి వారికి ఆ విషయం అర్థం కాకపోవచ్చు. తమోగుణం, రజోగుణంలో ఉన్నప్పుడు మీరు సాధన గురించి ఎంత చెప్పినా అది వారి మనసుకు పూర్తిగా అర్థం కాదు.

సత్వగుణంలోకి వచ్చినప్పుడే “సత్యాన్ని తెలుసుకోవాలి” అనే కోరిక కలుగుతుంది. సత్వగుణానికి నిదర్శనం  దైవంపై నమ్మకం, దైవంపై భక్తి, దైవంపై విశ్వాసం, దైవం పట్ల అమితమైన ప్రేమ. ఇలా ఉన్నవాడే మొదట శాంతిని కోరుకుంటాడు. కానీ తమోగుణం, రజోగుణంలో ఉన్నవాడు అశాంతిలో ఉండి శాంతి కోసం ప్రయత్నిస్తాడు. కానీ అతనికి శాంతి దొరకదు.

ఎందుకు దొరకదు? తనలోనే అశాంతిని పెంచుకుని, బయట శాంతి కోసం వెతికితే లాభం లేదు. తనలో అశాంతి ఎందుకు ఉంది అంటే ఈర్ష్య, ద్వేషాలు, కామ క్రోధాలు, అహంకార మమకారాలు ఇవన్నీ ఉన్నప్పుడు మనసు శాంతిని కోరుకుంటుంది, కానీ శాంతి కోసం సరైన విధంగా ప్రయత్నించదు.

ఎప్పుడైతే మీకు శాంతి ఉంటుందో, అప్పుడే మీరు ఎదుటివారిని కూడా శాంతిగా ఉండనిస్తారు. గమనించండి ప్రతి ఒక్కరూ ఎదుటివారిని శాంతిగా ఉండనిస్తేనే మీకు కూడా శాంతి దొరుకుతుంది. మీరు ఎదుటివారిని శాంతిగా ఉండనివ్వకపోతే మీకు శాంతి దొరకదు. మీకు శాంతి ఎందుకు లేదు అంటే, ఈ ద్వంద్వాలన్నీ మీలో ఉన్నంతకాలం మీ మనసుకు నిజమైన శాంతి దొరకదు. అందుకే మీరు బాహ్య విషయాల నుంచి మీ దృష్టిని క్రమంగా అంతరంలోకి మళ్లించుకోవాలి. "నేను ఆత్మను, అందరూ ఆత్మస్వరూపులే, సృష్టి అంతా ఆత్మమయమే" అనే ఎరుకలో జీవించడానికి ప్రయత్నించాలి. అప్పుడు భిన్నత్వం క్రమంగా తగ్గి, ఏకత్వ భావన పెరుగుతుంది. ఏకత్వ భావన పెరిగిన కొద్దీ కోరికలు, ద్వంద్వాలు, అశాంతి తగ్గుతూ, మీలో శాంతి, స్థిరత్వం, చివరకు ఆనందస్థితి అభివృద్ధి చెందుతాయి.

అందుకే మొదట్లో గురువులు మిమ్మల్ని అంతర్ముఖం చేస్తారు. మీలో ఉన్న దోషాలను మీరు స్వయంగా తెలుసుకునేలా చేస్తారు. "నాలో ఏ దోషం లేదు, నేను కరెక్ట్‌గానే ఉన్నాను" అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు. మీలో ఈ దోషం ఉంది అని ఎవరైనా చెబితే, ఒప్పుకునే స్థితిలో ఉండరు, ఎవరూ సులభంగా ఒప్పుకోరు. "మీకు కోపం ఎక్కువ" అంటే, "నాకు కోపం ఏంటి?" అంటారు. "మీకు అసూయ ఎక్కువ" అంటే కూడా ఎవరు ఒప్పుకోరు. అందుకే గురువులు చెబుతారు బయట ఏదీ లేదు, అంతరంలోనే అన్నీ ఉన్నాయి, మీకు ఏది కావాలన్నా అంతరంలోకి తిరగండి, ధ్యానం చేయండి అని చెబుతారు.

పత్రి గారెని ఏది అడిగినా సరే, ఆయన ఒకటే చెప్పేవారు "ధ్యానం చేయి, ధ్యానం చేయి." మరి ఎందుకు ధ్యానం చేయమని అంతగా చెప్పేవారు? ఈ కలియుగంలో ఎవరు ఎవరి మాట వినరు. అలాంటి పరిస్థితిలో మీకు ఏదైనా పరిష్కారం కావాలంటే ఒకే ఒక్క మార్గం ధ్యానం. ధ్యానం ద్వారానే ఏదైనా సాధించవచ్చు. అందుకే యోగివేమన "సాధనమున పనులు సమకూరు ధరణిలోన" అని అంటారు. అంటే ఈ భూమిమీద సాధన ఉంటే సాధించలేనిది ఏదీ లేదు.

ప్రతి మానవుడు ఎందుకు దుఃఖంలో ఉన్నాడు? జ్ఞానం లేక. మరి ఎందుకు జ్ఞానం పొందలేక పోతున్నాడు? చెప్పినా అర్థం కావడం లేదు. ఎందుకు అర్థం కావడం లేదు? అంటే అతని మేధస్సు పెరగడానికి కావలసిన శక్తి ఇంకా ఏర్పడలేదు. మరి ఎప్పుడైతే మీరు అంతరంలోకి తిరుగుతారో, కళ్ళను మూసుకుని ఆత్మను చేరుకోవడానికి ప్రయత్నిస్తారో, అప్పుడే సత్యాన్ని గ్రహించే శక్తి వస్తుంది. గురువు చెప్పింది అర్థం చేసుకునే శక్తి వస్తుంది. ఆత్మ అంటే ఏమిటో తెలుసుకునే శక్తి వస్తుంది.

ఇలాంటి శక్తులన్నీ వచ్చినప్పుడు, ఆత్మే దైవం అని అంతరంలోకి తిరిగినప్పుడే అర్థమవుతుంది. కానీ బాహ్యంలో తిరిగే వ్యక్తి అంతరంలో ఉన్న ఆత్మే దైవం అనే విషయాన్ని ఒప్పుకునే స్థితిలో ఉండదు. ఎవరైతే అంతరంలోకి వెళ్తారో! అంతర్ముఖులవుతారో! ఆత్మ యోగంలోకి ప్రవేశిస్తారో! వాళ్ళు మాత్రమే ఆత్మే దైవం అని తెలుసుకుంటారు. ఈ ఆత్మ నాలోనే కాదు, సర్వ జీవులలోనూ ఉంది, సృష్టి అంతా ఈ ఆత్మ చైతన్యంతో నిండి ఉంది, ఈ చైతన్యంతోనే సృష్టి నడపబడుతోంది అని ఎప్పుడైతే అర్థమవుతుందో, అప్పుడే ఆత్మే దైవం అనే సత్యం అర్థమవుతుంది.

మరి ఈ విషయాన్ని ఎవరు అర్థం చేసుకుంటారు? సాధనలోకి వచ్చిన వాళ్ళు, అంతర్ముఖులైన వాళ్ళు, ఆత్మ యోగంలో ప్రవేశించిన వాళ్ళు

మాత్రమే దీనిని అర్థం చేసుకుంటారు. మరి ప్రతి ఒక్కరూ ఎందుకు ధ్యానం చేయాలి? శాంతి కావాలన్నా ధ్యానం చేయాలి. ఆనందకరమైన జీవితం కావాలన్నా ధ్యానం చేయాలి. సత్యాన్ని తెలుసుకోవాలన్నా ధ్యానం చేయాలి.

మరి సత్యాన్ని ఎందుకు తెలుసుకోవాలి? ఎందుకంటే మానవ జన్మకే ఆ సత్యాన్ని తెలుసుకునే అర్హత ఉంది. మానవ జన్మ తీసుకున్న ప్రతి ఒక్కరూ ఆ సత్యాన్ని తెలుసుకుంటేనే మరణాతీత స్థితికి చేరుకోగలరు. అంటే చావు, పుట్టుకలు లేని స్థితి రావాలంటే అంతరంలో ఉన్న ఆత్మ దర్శనం కావాలి. ఆత్మ దర్శనం కావాలంటే ఆత్మ యోగంలోకి ప్రవేశించాలి. ఆత్మ యోగంలో నిశ్చల స్థితి రావాలంటే కామ, క్రోధాలు, ఈర్ష్య, అసూయ, లోభ, మోహాలు స్థూలంగా ఉన్న మనసును, ఈ దుర్గుణాలన్నింటినీ వదిలించుకుని, మనసును కలుషితాల నుంచి శుద్ధి చేసుకోవాలి. అప్పుడు మాత్రమే ఆత్మ దర్శనం కలుగుతుంది.

యోగంలోకి రావడానికి ఎంతోమంది రావచ్చు. “మీకు శాంతి అంతరంలో దొరుకుతుంది” అని తెలుసుకుని రావచ్చు. కానీ తనలో ఉన్న ఈ దుర్గుణాలను ఆపుకోవాలంటే ముఖ్యంగా ఆహార నియమాలు పాటించాలి, తర్వాత సజ్జన సాంగత్యంలో పాల్గొనాలి, స్వాధ్యాయం చేయాలి, ధ్యానం చేయాలి, బోధించే గురువుపై విశ్వాసం ఉంచాలి.

ప్రతి ఒక్కరూ గమనించవలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే పరమాత్మ కరుణ మీ మీద ఉన్నప్పుడే, ఆయనే తన అంశను సద్గురువు రూపంలో సత్యాన్ని చెప్పడానికి భూమిమీదకు పంపిస్తాడు అనే సత్యాన్ని తెలుసుకోవాలి. అలాంటి వారే సద్గురువులు అవుతారు. ఎదుటివారి నుంచి ఏమీ ఆశించకుండా, అవతలి వ్యక్తి పరమ దుర్మార్గుడైనప్పటికీ అతన్ని భగవంతుని వైపు తిప్పడానికి సద్గురువు ఒక్కడే ప్రయత్నిస్తాడు. మహాపాపి అయిన వ్యక్తిని కూడా దైవం వైపు మరల్చ గలిగే శక్తి ఒక సద్గురువుకు మాత్రమే

ఉంటుంది. అంతటి శక్తి సద్గురువుకే ఉంటుంది.

అలాంటి సద్గురువులు మీ జీవితంలోకి వచ్చి సత్యాన్ని చెబుతున్నప్పుడు, మీ మనసు బాహ్యంలో తిరిగినంత సేపు అది స్థూలంగా ఉండి, ఈర్ష్య, అసూయ, ద్వేషాలతో కలుషితం అవుతూ ఉంటుంది. అంతరంలోకి తిరిగి ఆ మనసును శుద్ధి చేసుకుంటేనే ఆత్మనే భగవంతుడిగా దర్శించే స్థితి మీకు కలుగుతుంది అని ధ్యాన మార్గంలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

మరి బాహ్యంలో తిరిగినప్పుడు "నేను, నాది" అనే స్వార్థంతో ఎన్నో పాపాలు చేస్తారు. కానీ కష్టం వచ్చినప్పుడు మాత్రం "భగవంతుడా, భగవంతుడా" అని అంటారు. కష్టం వచ్చినప్పుడు భగవంతుడా అని అంటున్నారంటే, భగవంతుడు మీకు దూరంగా ఎక్కడో ఉన్నాడు అని అనుకుంటున్నట్లే. కానీ భగవంతుడు ఎక్కడో దూరంగా లేడు, మీ హృదయం లోనే ఆత్మగా ఉన్నాడు. మీరు చేసినవన్నీ ఆయనకు తెలుసు, మీరు అనుకున్న వన్నీ తెలుసు. మీరు చేయబోయేవి కూడా లోపల ఉన్న ఆత్మకు తెలుసు.

అందుకే ప్రతి ఒక్కరూ ఆత్మ యోగంలోకి ప్రవేశిస్తేనే సత్యాన్ని తెలుసుకుంటారు, శాంతిగా ఉంటారు, ఆనందంగా ఉంటారు. బాహ్యంలో తిరిగి పాపాలు చేస్తారు; అంతరంలోకి తిరిగి శుద్ధి అవుతూ ఉంటారు. ఎప్పుడైతే మీరు శుద్ధి అవుతారో, అప్పుడు మీ బుద్ధి కూడా శుద్ధత్వంలోకి వస్తుంది. అందుకే "శుద్ధ బుద్ధే సిద్ధత్వంలోకి తీసుకువెళ్తుంది" అని అంటారు. అంటే మీ బుద్ధి శుద్ధమైనప్పుడే మీరు అనుకున్న సిద్ధిని పొందగలరు.

మీరు ఏదనుకుంటే అది చేయగలగడానికి కారణం ఏమిటంటే, మీ బుద్ధి శుద్ధంగా ఉండాలి. మరి బుద్ధి ఎప్పుడు శుద్ధమవుతుంది? బాహ్యంలో తిరిగే మనసు అంతరంలోకి వెళ్ళినప్పుడు, బుద్ధిజ్ఞానం పెరిగినప్పుడు బుద్ధి శుద్ధమవుతుంది. అప్పుడు ఏది తప్పో, ఏది రైటో తెలుస్తుంది. బాహ్యంలో

ఉన్నప్పుడు అశుద్ధ బుద్ధిగా ఉంటుంది; అంతరంలోకి వచ్చినప్పుడే శుద్ధ బుద్ధిగా మారుతుంది.

అందుకే ప్రతి ఒక్కరూ ఆత్మ యోగంలో ప్రవేశించి, మురికిగా ఉన్న మనసును శుద్ధత్వంలోకి తీసుకురావాలి. ఈరోజు మీరు ఏదైనా అనుకుంటున్నారు, కానీ అది జరగడం లేదు; ఏదైనా చేయాలనుకుంటున్నారు, కానీ చేయలేకపోతున్నారు అంటే, కారణం మీ మనసు ఇంకా శుద్ధత్వంలో లేదు అని మీకు మీరే తెలుసుకోవాలి. ఇంత స్థాయికి వచ్చి, ఇన్ని విషయాలు విన్న తర్వాత కూడా మీరు అనుకున్న పనిని సాధించలేక పోతున్నారంటే కారణం ఏమిటి? మీ మనసులో ఇంకా ఎక్కడో మురికి ఉంది. ఆ మనసు ఇంకా ఆత్మలో లయం కాలేదు. మురికిగా ఉన్న మనసు ఆత్మలో లయం కాదు. ఆ మురికిని తొలగించుకుని మనసు శుద్ధమైనప్పుడే అది ఆత్మలో లయమవుతుంది. అప్పుడు ఆ మనసు ఆత్మ స్వరూపంగా మారుతుంది. ఆ స్థితికి వచ్చినప్పుడు మీరు ఏమనుకుంటే, వాటిని సాధించగలిగే శక్తి మీలో ఏర్పడుతుంది.

అందుకే "సాధనమున పనులు సమకూరు ధరణిలో" అని కూడా అన్నారు. మీ మనసును ఎంత ప్యూర్‌గా ఉంచుకుంటారు, ఎంత సూక్ష్మంగా తయారు చేసుకుంటారు అంటే, బాహ్యమైన కోరికలు ఏవీ లేకుండా, బాహ్యమైన దుర్గుణాలు ఏవీ మనసులో లేకుండా చేసుకున్నప్పుడు ఏమవుతుంది? ఆ మనసు ఆత్మలో లయమైపోతుంది. ఆత్మగా మిగిలిపోతుంది. అప్పుడు మీకు బాహ్యమైన కోరికలు ఉండవు. మనసు ఆత్మలో లయమై, ఆత్మస్వరూపంగా మారిపోయినప్పుడు, మీరు ఏమి అనుకుంటే అది సాధించగలుగుతారు.

అలా సాధన కావాలంటే మూలం ఎక్కడ ఉంది? అంటే మీ మనసు బాహ్యంగా తిరగడమే ఇన్ని పాపాలకు, ఇన్ని కష్టాలకు కారణమైంది. అది బాహ్యంలో తిరిగి మురికిని పోసుకుంది. ఇప్పుడు అంతరంలో తిరిగి శుద్ధత్వాన్ని

పొందుతూ ఉంది. ఒక్క ధ్యానశక్తి వల్లే మనసు మారుతుంది. భక్తి వల్ల మారదు, కర్మ వల్ల మాత్రమే మారదు. ఒక్క ధ్యానం వల్ల మాత్రమే మనసుకున్న మురికిని, మనసులో ఉన్న దుర్గుణాలను మార్చుకోగలిగే శక్తి కలుగుతుంది. అందుకే ప్రతి ఒక్కరూ జీవితంలో ఆత్మయోగంలోకి ప్రవేశించే వరకు మనిషి అలజడులతో, ఆందోళనతో, అజ్ఞానంతో, మూర్ఖత్వంతో ఉండి, ఎవరికీ సుఖాన్ని ఇవ్వలేదు.

ఇలాంటి అలజడి, ఆందోళన, అహంకారం, అజ్ఞానంతో ఉన్న వ్యక్తి తాను సుఖపడలేడు, ఎవ్వరినీ సుఖపెట్టలేడు. కానీ ఆత్మ వైపు తిరిగిన మనసు ఉన్న వ్యక్తి తాను ఆనందంగా ఉంటాడు. అందరినీ ఆనందస్థితిలో ఉంచడానికి ప్రయత్నిస్తాడు. మీరు గమనిస్తే, సద్గురువులను గమనిస్తే ఈ విషయం మీకు అర్థమవుతుంది. వారు "నేను ఆత్మను" అని తెలుసుకున్నారు. మరి "నేను ఆత్మను" అని తెలుసుకున్నప్పుడు వారు ఎప్పుడూ ఆనందాన్ని పొందుతూనే ఉంటారు. వారు ఆనందాన్ని పొందుతున్నారు కాబట్టి, పది మందిని కూడా ఆనందింపజేయడానికి ప్రయత్నిస్తారు.

ఇప్పుడు మీరు ఎవరికైనా జ్ఞానం చెబుతున్నారంటే రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి  వాడు మాంసాహారం మానేస్తే ఎన్నో జీవులు హాయిగా బ్రతుకుతాయి. రెండోది వాడు తనకు తాను ఆనందాన్ని పొందే స్థితి ధ్యానం వల్ల మాత్రమే ఉంటుందని మీకు తెలుసు. కాబట్టి ఈరోజు మీరు ధ్యానం చేయడమే కాదు, అందరూ ధ్యానం చేయాలి అని, ఎవరికి చేతనైనంత స్థాయిలో వాళ్ళకు ధ్యానం చెప్పడానికి వెళ్తున్నారు. ఎందుకు? అందరూ బాగుండాలి, "సర్వేజనాః సుఖినో భవంతు" అంటారు కదా? అంటే అందరూ సుఖంగా, ఆనందంగా జీవించాలి.

ఎందుకంటే ప్రతి ఒక్కరి దుఃఖానికి కారణం వారు చేసే పాపకర్మలే. ఇది అందరికీ జగమెరిగిన సత్యం. పాపం చేయకూడదని, పాపం అని తెలిసినా

కూడా ఎందుకు చేస్తున్నారు? ఆ గుణం యొక్క ప్రభావం వల్ల. తమోగుణంలో, రజోగుణంలో ఉన్నప్పుడు పాపం అని తెలిసినా పాపం చేస్తారు. మరి ఎందుకు చేస్తున్నారు అంటే, వారు ఆ గుణం యొక్క ప్రభావంలో ఉన్నారు.

చాలామందికి అబద్ధం చెప్పడం తప్పని తెలుసు. దొంగతనం చేయడం తప్పని తెలుసు. కానీ అబద్ధం ఆడకుండా ఉండలేరు. ఎవరికీ తెలియకపోతే ఇతరులది తీసుకోవడానికి కూడా ప్రయత్నిస్తారు. మరి ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? మనిషి యొక్క గుణం మారలేదు. గుణం మారాలంటే సాధన తప్పించి రెండో మార్గం లేదు. ప్రతి వ్యక్తి ఆత్మ యోగంలోకి ప్రవేశించినప్పుడే ఆత్మను తెలుసుకునే అవకాశం వస్తుంది.

ఆత్మ యోగంలో ప్రవేశించడం అంటే ధ్యానం చేయడం, ఆత్మను చేరుకోవాలని ప్రయత్నించడం. అలా ప్రయత్నించిన వాడే తన గుణాలను మెల్లిమెల్లిగా మార్చుకుంటూ ఉంటాడు. ఇప్పుడు చూడండి, మీరు ఉన్నారు. ఈరోజు ధ్యానం కుదరడం లేదంటే వెంటనే విచారణ చేస్తారు. "ఈరోజు నా ఆహారంలో ఏమైనా మార్పు ఉందా? నా వ్యవహారంలో ఏమైనా తప్పు జరిగిందా?" అని విచారణ చేసి, ఆ పద్ధతిని మార్చుకోవడానికి ప్రయత్నిస్తారు.

ఎందుకంటే ఆత్మ ప్రయాణంలోనే ఆనందం ఉంది. నిజంగా ఆత్మను దర్శిస్తే ఇంకెంత ఆనందంగా ఉంటుందో అని ప్రతి ఒక్కరికీ తెలుసు. మీరు అది తెలుసుకున్నారు కాబట్టే అందరూ ఆత్మ యోగంలో ప్రవేశించాలి అనే కోరికతోనే ఈవేళ అందరికీ ధ్యానం చెప్పాలని ప్రయత్నిస్తున్నారు. బాహ్యంలో సుఖం ఉండొచ్చు, భోగాలు ఉండొచ్చు, సంతోషం ఉండొచ్చు. కానీ శాంతి, ఆనందం ఈ రెండూ ఆత్మ దగ్గరే ఉంటాయి. ఆత్మ యోగంలో ప్రవేశించి ఆత్మను చేరుకోవాలని ప్రయత్నించినవారికే శాంతి, ఆనందం దొరుకుతాయి.

అందుకే చూడండి, మీరు కూడా బాగా చిరాగ్గా ఉన్నప్పుడు, ధ్యానం తెలియనప్పుడు కూడా కాసేపు అలా కళ్ళను మూసుకుంటారు. ఇంకొక

విషయం గమనించండి. గాఢనిద్రలో ఉన్నప్పుడు తెల్లవారిన తర్వాత "గాఢనిద్ర పట్టింది, హాయిగా నిద్రపట్టింది" అని చెబుతారు కదా? అంటే ఏమిటి? అప్పుడు మనసు లేదు. మనసు ఆత్మలో లయమైపోయింది.

మనసు లేని స్థితిలో ఉన్నప్పుడు, అంటే గాఢనిద్రలో ఉన్నప్పుడు, తెల్లవారిన తర్వాత లేచి "హాయిగా ఉంది" అని అంటారు. మళ్ళీ తెల్లవారిన తర్వాత కళ్ళను విప్పింది మొదలు మనసు ప్రవేశించగానే శాంతి కాస్తా అశాంతిగా మారుతుంది. అంటే మీరు ఎరుక లేకుండా చేస్తున్న ప్రయత్నం అది. కానీ ధ్యానం అనేది ఈ మనసు ఆత్మలో లయమవ్వడమే. ఆ లయం ఎలా ఉంటుంది అంటే, ఇప్పుడు చూడండి, మీరు చాలా డీప్‌గా ధ్యానంలోకి వెళ్ళిపోయారు. అప్పుడు మనసు ఆత్మలో లయం అవుతుంది. ఆ సమయంలో ఎవరైనా లేపినా కోపం వస్తుంది. ఎందుకు? అక్కడ హాయిగా ఉంది. మనసు లేని స్థితిలో ఉన్నారు. అందుకే హాయిగా ఉంది.

మనసు ఉంటేనే మానవుడికి బాధ, చింత ఉంటాయి, మనసు లేనప్పుడు ఏ చింతా ఉండదు, నిశ్చింతగా ఉంటారు. ఆ ప్రయత్నమే ధ్యానం. ధ్యానం అంటే మరేమీ కాదు మనసును ఆత్మలో లయం చేసి, ఈ మనసు ఆ ఆత్మగా మారిపోవడం, అదే "ఆత్మ యోగం". ఆ యోగంలో ఉన్న ప్రతి ఒక్కరూ శాంతిగా, ఆనందంగా జీవించగలుగుతారు. అందుకే భూమిమీద మానవుడికి ఎక్కడా శాంతి దొరకదు, ఎక్కడా ఆనందం దొరకదు. ఎప్పుడైతే ఆత్మ యోగంలో ప్రవేశించి ఈ మనసును ఆత్మలో లయం చేయడానికి ప్రయత్నిస్తాడో, అప్పుడే శాంతి, ఆనందం మానవుడికి దొరుకుతాయి. అందుకే గాఢనిద్రలో దొరికే ఆనందం తాత్కాలికమైనది; ధ్యానంలో దొరికే ఆనందం సాధన ద్వారా పొందే స్థితి. మూర్ఖుడు గాఢనిద్రలో దొరికిన ఆనందంతో తృప్తి పడతాడు. కానీ జ్ఞాని ధ్యానంలో ఆ స్థితిని పొంది ఆనందపడతాడు. అందుకే యోగి ఎప్పుడూ ఆనంద స్థితిలో ఉంటాడు. ఎందుకు? తన స్థితిని

తాను మార్చుకోగలడు. యోగికి తెలుసు కళ్ళను మూసుకుని ఆత్మలో లయమైనప్పుడే ఈ మనసుకు ప్రశాంతత అని. పని ఉన్నప్పుడు కళ్ళను తెరిచి పని చేస్తాడు, పని లేనప్పుడు కళ్ళను మూసుకుని ఆత్మలో లయం అవ్వడానికి ప్రయత్నిస్తాడు. కానీ భోగికి ఎప్పుడు కావాలంటే అప్పుడు గాఢనిద్ర రాదు కదా? అందుకని ఆ శాంతి కోసం ప్రయత్నిస్తాడు.

అందుకే భోగికి, యోగికి తేడా ఏమిటంటే భోగి శాంతి కోసం ప్రయత్నిస్తూ ఉండాలి. కానీ యోగి ఎప్పుడు కావాలంటే అప్పుడు ధ్యాన స్థితిలో ఉండి, ఆత్మలో మనసును లయం చేసి, తాను నిశ్చింతంగా జీవితం గడుపుతూ ఉంటాడు. ఎప్పుడైతే మనసు ఆత్మలో లయం అవుతుందో, అప్పుడు శాంతి, ఆనందం ప్రతి ఒక్కరి జీవితంలోనే ఉంటాయి. భగవంతుని దగ్గర లేని శాంతి, భగవంతుని దగ్గర లేని ఆనందం ఎక్కడ ఉంటాయి చెప్పండి? అన్నీ ఆయనలోనే ఉంటాయి. మీరు వెతకాల్సింది ఆయననే. మీరు చేరాల్సింది ఆయన దగ్గరకే. మీరు పొందాల్సింది ఆయన దగ్గరే. అందుకే ఆత్మ యోగంలో ప్రవేశించిన ప్రతి ఒక్కరికీ శాంతి, ఆనందం లభిస్తాయని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

పది మందికి కూడా మీరు తెలియచెప్పాలి. ఆయన సృష్టిలో శాంతి, ఆనందం ఉన్నాయి. అవి రెండూ ఆయన దగ్గరే ఉంటాయని మీరు తెలుసుకుని, అందరికీ అదే విషయాన్ని తెలియచెప్పాలి, ఎందుకంటే అజ్ఞానులకు తెలియదు; జ్ఞానులకు తెలుసు. తెలిసినవాళ్ళు తెలియని వాళ్ళకు చెబితేనే కదా వారికి అర్థమయ్యేది. అందుకే మీ ప్రయత్నం మీరు చేయాలి. వాళ్ళు వింటారా, వినకపోతారా అనేది వారి గుణాన్ని బట్టి ఉంటుంది. కానీ మీరు అందరికీ చెబుతారు. వాళ్ళ గుణాన్ని బట్టి, వాళ్ళ అర్హతను బట్టి వారు దానిని స్వీకరిస్తారు.

# బ్రహ్మాం అంటే?

వేదాల్లో ఒక మాట ఉంటుంది "అహం బ్రహ్మాస్మి" అని. "అహం బ్రహ్మాస్మి" అనగానే వెంటనే మీకు ఒక ప్రశ్న వస్తుంది 'నేను దేవుడినా?" అని. అయితే "అహం బ్రహ్మాస్మి" అంటే సరైన అర్థం ఏమిటో తెలుసుకోవాలంటే, ముందుగా బ్రహ్మాం అంటే ఏమిటి? బ్రహ్మము యొక్క లక్షణాలు ఏమిటి? ఏ చైతన్యంతో బ్రహ్మాం ఉంది? అనే విషయాలను మీరు అవగాహన చేసుకోవాలి. బ్రహ్మము అంటే ఈ బ్రహ్మాండాన్ని ఏ శక్తితో నడిపిస్తుందో, ఏ చైతన్యంతో ఈ సృష్టి కొనసాగుతుందో, అదే చైతన్యం మీలో కూడా ఉంది, అదే విషయాన్ని వ్యాసులవారు తెలియజేశారు.

"అహం బ్రహ్మాస్మి" అంటే బ్రహ్మము యొక్క చైతన్యంతోనే సృష్టిలోని జీవులన్నీ ఉన్నాయి అని అర్థం. ఆయన ఉద్దేశం "నేనే దేవుడిని" అని కాదు. ఈ బ్రహ్మాండం అంతా, జీవులు, జీవరాశులు, నదులు, కొండలు, కోనలు ఇవన్నీ కూడా ఒకే ఒక్క చైతన్యంతో నడుస్తున్నాయి. అంటే బ్రహ్మములో ఏ చైతన్యం అయితే ఉందో, మీలో కూడా అదే చైతన్యం ఉంది. దానినే బ్రహ్మము అంటారు, దానినే చైతన్యము అంటారు, దానినే ఆత్మగా చెబుతారు.

మరి ఈ చైతన్యము యొక్క లక్షణాలు ఏమిటి? అవి భగవద్గీతలోనే చెప్పారు "నీరు తడపలేదు, నిప్పు కాల్చలేదు, గాలి కదపలేదు" అని. అంటే ఏ భౌతిక శక్తి కూడా ఆ చైతన్యాన్ని ఏమి చేయలేదు. ఈ లక్షణాలన్నీ ఆత్మకు ఉన్నాయి, బ్రహ్మముకు ఉన్నాయి. కానీ మానవుడు తాను ఆ చైతన్య స్వరూపుడని, తాను ఆత్మ స్వరూపుడని తెలుసుకోక, తాను ఆరు అడుగుల శరీరమే అనే అహాన్ని పెంచుకుంటున్నాడు. తాను శరీరమే అని అనుకుంటున్నప్పటికీ, తనలోని బ్రహ్మ భావన పూర్తిగా పోలేదు. తనకు తెలియకుండానే ఆ చైతన్య స్థితినే కోరుకుంటాడు.

చూడండి  ఆత్మకు చావు ఉందా? అంటే ఆత్మకు చావు లేదు. అందుకే ప్రతి ఒక్కరూ కూడా చావడానికి ఇష్టపడరు. మరి చావును ఎందుకు కోరుకోరు అంటే, ఆత్మకు చావు లేదు కాబట్టి. కానీ అజ్ఞానంతో శరీరాన్ని "నేను" అనుకుంటాడు కాబట్టి, శరీరానికి వచ్చే చావుని తన చావుగా భావించి భయపడతాడు, బాధపడతాడు. అందుకే ఆత్మకు చావు లేదు కాబట్టి, ఏ శరీరంలో ఉన్న వాడైనా అజ్ఞానంలో ఉన్నంతకాలం చావును కోరుకోడు.

అలాగే ఆత్మకు స్వతంత్రత, స్వేచ్ఛ ఉన్నాయి. అందుకే ప్రతి ఒక్కరూ స్వేచ్ఛను కోరుకుంటారు, స్వేచ్ఛగా ఉండాలనుకుంటారు. ఒకరి క్రింద బందీగా, గులాముగా ఉండటాన్ని ఎవరూ ఇష్టపడరు. ఒకరి మాటను పరిస్థితుల వల్ల తప్పనిసరిగా వినాల్సి వస్తే వింటారు, కానీ అవకాశం ఉంటే ప్రతి ఒక్కరూ తమకు తాము స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటారు. దీనికి కారణం ఆత్మ స్వభావమే స్వతంత్రత మరియు స్వేచ్ఛ. మీరు గమనిస్తే, ఇది ఆత్మ యొక్క లక్షణం.

అలాగే ఆత్మ ప్రేమ స్వరూపం. భగవంతుడు అంటేనే ప్రేమ. ఈ ప్రేమ స్వరూపం కాబట్టే మీరందరూ ప్రేమనే కోరుకుంటారు. మీరు గమనించండి, ఎవ్వరైనా సరే మిమ్మల్ని ప్రేమించాలి అని కోరుకుంటారు. కానీ మిమ్మల్ని ఎవరూ ద్వేషించాలని మీరు కోరుకోరు. ఎందుకంటే ఆ ప్రేమ యొక్క విలువ మీకు తెలుసు. అది ఆత్మ యొక్క లక్షణమే.

అలాగే ఆత్మ సుఖ స్వరూపం. అందుకే అందరూ సుఖాన్ని కోరుకుంటారు, కానీ కష్టాన్ని ఎవ్వరూ కోరుకోరు.

అలాగే ఆత్మ ఆనంద స్వరూపం, "సచ్చిదానంద స్వరూపమే ఆత్మ". అందుకే మీరు కూడా ఎప్పుడూ ఆనందాన్ని కోరుకుంటారు కానీ దుఃఖాన్ని కోరుకోరు. దుఃఖాన్ని ఎవ్వరూ ఇష్టపడరు.

ఆత్మ శాంతి స్వరూపం. అందుకే అందరూ శాంతినే కోరుకుంటారు, అశాంతిని ఎవ్వరూ ఇష్టపడరు. అంటే ఇక్కడ ఇవన్నీ చావు లేని ఆత్మ కాబట్టే

మీరు చావును కోరుకోరు, ఆత్మ స్వతంత్రంగా ఉంటుంది కాబట్టి మీరు స్వతంత్రతను కోరుకుంటారు, స్వేచ్ఛగా ఉండాలనుకుంటారు.

మరి మీకు చావు వద్దు అనుకున్నా చావు ఎందుకు వస్తుంది? అంటే "నేను" శరీరం అనే భావమే చనిపోతున్నాను అని అనుకుంటున్నారు. మీ శరీరానికి చావు ఉంది, అందుకే మీరు మళ్ళీ మళ్ళీ పుడుతున్నారు, చనిపోతున్నారు. అందరూ ఇది వద్దు అనుకుంటున్నారు, కానీ "నాకు చావు లేదు, కానీ నా శరీరానికి చావు ఉంది" అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. చిరిగిన వస్త్రాన్ని ఎలా విసర్జిస్తామో, అలాగే ముసలి శరీరాన్ని 'ఆత్మ' అలా విసర్జిస్తుంది అనే సత్యాన్ని తెలియక మీరు చావంటే భయం ప్రదర్శిస్తున్నారు.

అందుకే జ్ఞాని చావుకు భయపడడు, అజ్ఞాని చావుకు భయపడతాడు అంటారు. జ్ఞాని అంటే ఆత్మ స్వరూపాన్ని తెలిసిన వాడు, అజ్ఞాని అంటే దేహమే నేను అని అహంకారాన్ని పెంచుకొని, దేహానికి ఉన్నవన్నీ తనకు ఆరోపించుకొని, అంటే "అన్నీ నాకే వస్తున్నాయి" అని భావించి దుఃఖంలో ఉంటున్నాడు.

మరి అందరూ మోక్షాన్ని కోరుకుంటున్నారు, "నాకు మోక్షం కావాలి, మోక్షం కావాలి" అని కోరుకుంటారు. మీ స్వరూపమే మోక్ష స్వరూపం, మీరు మోక్షంలోనే ఉన్నారు. వేరే కొత్తగా మీకు వచ్చేది ఏమీ లేదు. మీరు ఆత్మలైనందున సహజసిద్ధంగా మీరు మోక్ష స్వరూపులే, మోక్షం అంటే ఆనంద స్వరూపమే. కానీ దేహమే నేను అనుకోవడం వల్ల మోక్షానికి దూరంగా ఉన్నామని అనుకుంటారు. ఎప్పుడైతే "దేహమే నేను" అనే అహంకారం పోతుందో, అప్పుడు మీరు మోక్షంలోనే ఉన్నారని తెలుసుకుంటారు.

ఈ శరీరం కట్టెలలో కాలిపోయినా, ఈ అహంకారం వల్లే మీకు జన్మలు వస్తాయి అనే పరమ సత్యాన్ని ఎవరైతే తెలుసుకోరో, ఆ విషయాన్ని తెలుసుకోకపోతే వారు జ్ఞానం వైపు అడుగులు వేయలేరు. "దేహమే నేను"

అనే అజ్ఞానపు భావనలే సూక్ష్మ శరీరాన్ని అంటిపెట్టుకుని మరుజన్మకు కారణం అవుతున్నాయి. ఇప్పుడు మీరు ఇంత నేర్చుకుంటున్నారు, చాలా చాలా నేర్చుకున్నారు. ఇప్పటికి "నేను ఆత్మను" అనే అవగాహన చాలా మందికి ఉండవచ్చు. కానీ మీరు ఇందులో ఎంతో చక్కగా ఎదుగుతూ ఉన్నప్పటికీ, ఇంకా "దేహమే నేను" అనే భ్రాంతి వల్ల ఆరోగ్యం కోసం, సంకల్పాల కోసం మీరు ప్రాకులాడుతున్నారు.

కొంతమంది ఉంటారు ఎంతసేపూ "ఆరోగ్యం, ఆరోగ్యం" అంటారు. కానీ ధ్యానం అనేది ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి. అంటే ఇక్కడ అవగాహన లోపం వల్ల ఇంకా అదే పాట పాడుతున్నారు. భూమిమీదకు వచ్చిన ప్రతి మహాత్ముడు "నువ్వు దేహం కాదు, నువ్వు ఆత్మవి" అని చెప్పారు. స్పిరిచువాలిటీ అంటేనే ఆత్మతత్వాన్ని తెలుసుకోవడం, శరీరం గురించి తెలుసుకోవడం కాదు.

కానీ మీరు తొక్క గురించి తెలుసుకుంటున్నారు, లోపల ఉన్న విత్తనాన్ని మర్చిపోతున్నారు. విత్తనం యొక్క క్వాలిటీ పెంచితే మంచి వృక్షం అవుతుంది. పైన ఉన్న తొక్కకు క్వాలిటీ అవసరం లేదు, అది విత్తనానికి రక్షణ మాత్రమే. అలాగే ఆత్మ ఈ దేహాన్ని తీసుకుంది అంటే సాధన కోసం, కొన్ని పనులు చేయడానికి, తన స్థితిని పెంచుకోవడానికి ఈ శరీరాన్ని తీసుకుంది. కాబట్టి దేహ దృష్టిని తగ్గించి, ఆత్మ దృష్టిని పెంచాలి. ఆత్మ శాశ్వతం, శాశ్వతం అని ఎందరో మహాత్ములు భూమిమీదకు వచ్చి చెబుతూనే ఉన్నారు. మరి ఈ మార్గంలోకి వచ్చిన మీరు అయినా అర్థం చేసుకోవాలి. రాని వాళ్లు అర్థం చేసుకోకపోవడం వేరే విషయం.

ఇక్కడికి వచ్చిన మీరు ఆత్మోన్నతికి, ఆత్మశక్తిని పెంచుకోవడానికి, మీ సహజ స్వరూపమైన ఆనంద స్వరూపాన్ని తెలుసుకోవడానికి, మీ సహజ స్థితి అయిన మోక్ష స్థితిని తెలుసుకోవడానికి సాధన చేసి జ్ఞానాన్ని పెంచుకోవాలి

అనే భావం మీలో ఉండాలి. దేహ పరమైన అహంకారం నశించకపోతే మీ సహజ స్థితి అయిన మోక్షం మీకు అర్థం కాదు. మోక్షం అంటే ఎక్కడో ఆకాశం నుంచి వచ్చి మీ ఒడిలో పడేది కాదు, మీ సహజ స్థితి మోక్షమే.

మీరు మోక్షంలో ఉన్నప్పటికీ ఆనందంలో ఉండలేకపోవడానికి కారణం అజ్ఞానం అనే పొర, అజ్ఞానం అనే ముసుగు మీరు వేసుకొని ఉండటమే. ఆ ముసుగును తీస్తే ఏమిటి? అజ్ఞానం అంటే "దేహమే నేను, ఈ దేహం శాశ్వతం" అనే భ్రమలో, భ్రాంతిలో చిన్నప్పటి నుంచి జీవించడం. ఈ దేహం మీద మమకారం పెంచుకొని, దేహమే నేనని అహంకారాన్ని పెంచుకోవడం. ఇదే పెద్ద అజ్ఞానం. కానీ ఈ అజ్ఞానం తొలగిన రోజున, భగవంతుడు బ్రహ్మములో ఏ చైతన్య శక్తి ఉందో, మీలో కూడా అదే చైతన్య శక్తి ఉంది అని గురువు ద్వారా తెలుసుకున్న సాధన ద్వారా, జ్ఞానం ద్వారా, మరి దీనిని పరిపూర్ణ విశ్వాసంతో నమ్మితే, మీరు సాధన చేయగా చేయగా చేయగా అహంకారాన్ని పోగొట్టుకుంటారు. అందుకే ఉన్న ఆత్మ లేదనుకుంటాం, లేని అహంకారం ఉందనుకుంటున్నాం.

"నేను శరీరం" అని అనుకుంటే మీకు అహంకారం వస్తుంది. "నేను ఆత్మను" అని అనుకుంటే, ఉన్నది ఉన్నట్టుగా సత్యాన్ని గ్రహించినవారు అవుతారు. అప్పుడు ఎప్పుడైతే "ఆత్మే నేను, నేను చైతన్య స్వరూపుడిని" అని తెలుసుకుంటారో! బ్రహ్మము ఏ చైతన్యంతో సృష్టిని నడిపిస్తుందో, ఆ చైతన్య శక్తే ఈ ఆరడుగుల శరీరాన్ని నడిపిస్తుంది. అదే నేను, కానీ ఈ తొడుగు నేను కాదు అనే పూర్తి అవగాహన మీకు వస్తే, "అహం బ్రహ్మాస్మి" అనేది అర్థమవుతుంది. "అహం బ్రహ్మాస్మి" అనగానే "నేను దేవుడిని" అనే అహంకారాన్ని, కొత్త గర్వాన్ని పెంచుకోవడం కాదు. పరమాత్మ, నేను ఒక్కటే, ఒకే చైతన్యం అని తెలుసుకోవడం.

కానీ మీలోని చైతన్యం ఏమిటో తెలియక, దేహాన్ని చూసుకుంటూ, "నేను, శరీరం" అనే అహంకారాన్ని పెంచుకుంటూ ఉంటే, ఈ అహంకారం

మీ నుంచి పోదు, అంతవరకు మీరు కర్మలు చేస్తూనే ఉంటారు, జన్మలు పెంచుకుంటూనే ఉంటారు.

కానీ అహంకారం పోయిన వెంటనే, "నేను చేస్తున్నాను" అనే భావం కూడా పోతుంది. మీలో అహంకారం పోగానే ఆత్మ భావం పెరుగుతూ ఉంటుంది. అంతవరకు "నేను దేహం" అని అనుకున్నని జన్మలు పెరుగుతాయి. చావు, పుట్టుకలు వుంటాయి. ఆ భావం మీలో నశించినపుడు ఇంక వుండదు, కర్మలు వుండవు "అహం బ్రహ్మాస్మి" స్థితిలో మీరు వుంటారు.

అది ఒక స్థితి కానీ, "నేను దైవం" అన్నది కాదు. "అహం బ్రహ్మాస్మి" అంటే తెలుసుకోవాల్సింది ఏమిటంటే బ్రహ్మంలో ఉన్న చైతన్యమే, ఆ చైతన్య శక్తే మీలో కూడా ఉంది. ఆ చైతన్యమే ఆత్మ. ఆ లక్షణాలన్నీ మీరు తెలుసుకుంటూ, ''నేను ఎందుకు ఇలా ఉన్నాను? ఆనందం కావాలనుకుంటున్నాను, శాంతి కావాలనుకుంటున్నాను, స్వేచ్ఛగా ఉండాలనుకుంటున్నాను ఇవన్నీ ఎందుకు ఉన్నాయి?" అని విచారణ చేయాలి. మీరు ఆత్మ కాబట్టి, మీరు ఆత్మనే. ఆత్మ లక్షణాలు అవి. అవి మీలో ఉన్నాయి. మీరు అవే కోరుకుంటున్నారు.

ఎప్పుడైతే భగవంతుడి కృప వలన గురువు వచ్చాడో, గురువు ద్వారా "నేను ఆత్మను" అని తెలుసుకున్నారో, అప్పటి నుంచే కదా మీకు ఇన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఆ సాధన చేయడం వల్లనే కదా మీకు ఇంత జ్ఞానం వచ్చింది. ఎందుకంటే మీరు మంచి మార్గంలో ఉన్నారా లేదా అని తెలుసుకోవడానికి ఒక్కటే ఉదాహరణ. గీతలో కృష్ణ భగవానుడు చెప్పింది "జ్ఞానులే నాకు ఇష్టులు" అన్నాడు. భక్తులు కాదు, కర్మ యోగులు కాదు అని కాదు, మరి జ్ఞానులే తనకు ఇష్టులు. భక్తి ఉండవచ్చు. కేవలం భగవంతుని కోరుకోవడమే భక్తి. భగవంతుడికి ఇష్టమైన కర్మలు చేయడమే పుణ్య కర్మలు, సత్కర్మలు. కానీ భక్తి కర్మ కాదు. భగవంతుడికి నచ్చే వారు జ్ఞానయోగులు,

జ్ఞానం పెంచుకున్నవారే. భగవంతుడికి ఇష్టులు అంటే, మరి పూర్వం మీకు ఇంత జ్ఞానం ఉందా? మీరు ఇక్కడికి వచ్చాక ఇన్ని విషయాలు తెలుసుకుంటున్నారు అంటే, మీ జ్ఞానం పెరుగుతోంది. ఈ సాధన ద్వారా ఖచ్చితంగా గురువును భగవంతుడు పంపాడు. మరి ఆ గురువు దగ్గరకు వచ్చి, ఆ సాధన చేసి, ఇంత జ్ఞానాన్ని మీరు పెంచుకుంటున్నారని, ప్రతిరోజూ కొత్త విషయం తెలుసుకున్నప్పుడల్లా పరమాత్మకు, గురువుకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఎందుకంటే ఇంత జ్ఞానాన్ని భగవంతుడే మీకు ఇప్పిస్తున్నాడు, ఒక్కొక్క మెట్టు ఎక్కిస్తున్నాడు. మరి ఆ సత్యలోకం చేరాలి అంటే, ఆ ఏడో లోకం చేరాలి అంటే, భూమిమీద మీరు సాధన చేసి ఈ జ్ఞానాన్ని పెంచుకోవాలి. "అహం బ్రహ్మాస్మి" అంటే నేను దేవుడిని అనుకోవడం కాదు. దైవంలో ఏ చైతన్య శక్తి ఉందో, మీలో కూడా అదే ఉంది. అదే ఆత్మ. అందుకే గురువులు "నువ్వు ఆత్మవి, నువ్వు శరీరానివి కాదు" అని చెబుతున్నారు. శరీరం అనుకుంటే జన్మ, "నేను ఆత్మను" అని అనుకుంటే మోక్షం. రెండిటికీ డిఫరెన్స్ ఉంది. జన్మ ఉంటే దుఃఖం, మోక్షం అంటే ఆనందకరమైన స్థితి. అందుకే "అహం బ్రహ్మాస్మి" అని మీరు తెలుసుకోవాలని గురువులు ఇంత వివరణ ఇచ్చారు. "నేను దేవుడిని" అంటూ అహంకారం పెంచుకోవడం కాదు, "నేను ఆత్మ స్వరూపుడిని, నా స్థితి మోక్ష స్థితి" అని తెలుసుకోవాలి. అజ్ఞానం అనేది మీకు ఉంది కాబట్టి, ఆ అజ్ఞానం అనే తెరను తొలగిస్తే, మీరు నిత్యం మోక్ష స్థితిలోనే ఉంటారు అని మీరు అర్థం చేసుకోవాలి. అది ఎక్కడి నుంచో వచ్చేది కాదు. మీ అజ్ఞానాన్ని పూర్తిగా తొలగించిన రోజునే, "నేను మోక్ష స్థితిలోనే ఉన్నాను" అని మీరు తెలుసుకుంటారు.

"అహం బ్రహ్మాస్మి" అంటే 'నేనే దేవుడిని' అనే అహంకారం కాదు, బ్రహ్మాండాన్ని నడిపించే అదే చైతన్య శక్తి మీలో కూడా ఆత్మగా ఉందని తెలుసుకొని, దేహాభిమానాన్ని వదలి సహజమైన మోక్ష స్వరూపాన్ని తెలుసుకోవడం.

# ఒక సాధకుడి మీద ఈశ్వర అనుగ్రహం ఎలా కలుగుతుంది?

భగవంతుడు కృప వల్లే మీకు గురువు దొరికాడు మరి ఒక సాధకుడి మీద "ఈశ్వర అనుగ్రహం" ఎలా కలుగుతుందో తెలుసు కుందాం? భూమిమీద ఉన్న సత్ప్రవర్తన వల్ల మీకు గురువు దొరికితే ఆ గురువు వల్ల భగవంతుడిని ఎలా తెలుసుకోవచ్చో మార్గం తెలుస్తుంది.

ఎందుకంటే నాలుగు రకాల భక్తుల్లో జిజ్ఞాసువు అంటే భగవంతుడి కోసం అన్వేషించిన వారికి, త్రికరణ శుద్ధిగా భగవంతుడిని కోరుకునే వారికి, భగవంతుడిని అన్వేషిస్తూ దారి తెలియక తపించే వాళ్ళకి భగవంతుని కృప వల్లే గురువు దొరుకుతాడు.

గురువు దొరికినప్పుడు ఆ మార్గంలో పయనిస్తున్న మీకు ఈశ్వర అనుగ్రహం ఎలా కలుగుతుంది అంటే? ఎప్పుడైతే మీ జీవితంలోకి గురువు వచ్చి చెప్పిన దాన్ని మీరు పరమాత్మ యొక్క మాటగా స్వీకరించి, ఆయన ఆదేశంగా మీరు స్వీకరించి దాన్నే అనుసరించాలి.

ఎందుకంటే గురువు ఆత్మే భగవంతుడు అని చెప్పాడు, అదే మీరు స్వీకరించాలి. ఆత్మే భగవంతుడు అని నమ్మాలి. నమ్మితేనే ఈ సాధన కరెక్ట్‌గా చేస్తారు మరి అంతరంలో ఆత్మ ఉంది అని ఎప్పుడైతే తెలుసుకున్నారో భగవంతుడి అన్వేషణ ఇక్కడి నుంచి మీకు ప్రారంభం అవుతుంది.

ఈ సృష్టిలో అన్ని జీవులు, అందరూ కూడా ఈ ప్రయాణం చేయలేరు, ఈ ఆత్మ మార్గంలో ఉండలేరు. మీరు తమోగుణం, రజోగుణం, సాత్వికం శుద్ధ సాత్వికం నిర్గుణం అని తెలుసుకున్నారు. మరి ప్రారంభ జన్మలలో అంటే మానవజన్మలోకి వచ్చిన ప్రారంభ జన్మల్లో మీరు ఏ ప్రయత్నము చేయరు.

ఇక్కడ ఏ జీవికి లేని తెలివి, బుద్ధి మానవుడికి ఇచ్చి మోక్షాన్ని

పొందే అవకాశాన్ని కూడా భగవంతుడు కల్పించాడు.  మనసుకి ఉండేది తెలివి మరి బుద్ధిలోనికి పోయేది జ్ఞానం. అందుకే తెలివిగా అన్నిటిని విచారణ చేస్తూ దానినుంచి వచ్చే ఫలితాన్ని, ఆ జ్ఞానాన్ని నిక్షిప్తం చేసుకోగలగాలి.

మీరు మొట్టమొదటగా తమోగుణంలో, రజోగుణంలో భగవంతుడు గురించి తెలుసుకుంటారు. కానీ భగవంతుడిని అన్వేషించరు. కోరికలు తీర్చుకోవడానికి భగవంతుడిని ఉపయోగించుకుంటారు. అంటే పూజలు, హోమాలు, వ్రతాలు, తీర్థయాత్రలు, యజ్ఞయాగాలు లాంటివన్నీ కూడా కోరికలు తీర్చుకోవడానికే భగవంతుడిని ఉపయోగించుకుంటారు.

చేసిన వాటికి కొద్దో గొప్పో ఫలితం వచ్చినా అవి భగవంతుడిని చేరుకునే మార్గాలు కావు.  సృష్టిలో మీకు కొన్ని దక్కవచ్చు కానీ భగవంతుని చేరుకునే మార్గాలు అవి కావు అని గురువులు వచ్చేవరకు మీకు తెలియదు, అంటే పుణ్యకర్మల వల్ల కొంచెం ఫలితం రావచ్చు, కొంచెం తృప్తి కలగవచ్చు కానీ శాశ్వత ఆనంద స్థితి కలగదు.

కానీ ఎప్పుడైతే మీ అన్వేషణ ప్రారంభం అవుతుందో భగవంతుడిని చేరుకోవాలని, తెలుసుకోవాలని తీవ్రాతి తీవ్రమైన తపన ఉంటుందో ఆ తపనే తపస్సుగా మారి మీరు భగవంతుడు గురించి మధన పడుతూ ఉంటారు. అదే చాలామంది భక్తి అని చెప్పుకుంటారు. కేవలం భగవంతుని మీద దృష్టి వుంచడమే భక్తి కానీ భగవంతుడు ఇచ్చేవాటి గురించి కోరడం భక్తి కాదు.

ఒక మీరాబాయి, అన్నమయ్య, త్యాగరాజు లాంటి వాళ్ళ భక్తిని భక్తి అంటారు. వాళ్ళు ఏ దేవుడినైతే ఆరాధించారో ఆ దేవుడి కోసం వాళ్ళు ఎన్ని కష్టాలు పడినా ఆ దేవుడిని మార్చలేదు, దేవుడి ఇచ్చే సంపదలని కోరుకోలేదు.  ఆ భగవంతుడినే వాళ్ళు కోరుకున్నారు, ఆ కష్టాలైనా పడ్డారు కానీ వాళ్ళ భక్తిలో మార్పు రాలేదు.

మరి మీకు కూడా అలాంటి భక్తి ఉన్నప్పుడే దారి చూపే గురువు దొరుకుతాడు. మీరు గతజన్మలో అంత తీవ్రమైన తపనతో భగవంతుడిని ఆరాధించారో ఏమో అందుకే పత్రిగారిలాంటి సద్గురువులు దొరికారు. భగవంతుడు ఎవరు? ఎక్కడ ఉంటాడు? ఎలా చేరుకోవాలి? అని ఇవన్నీ వివరంగా విశదంగా మనకి తెలియపరిచారు.

అలా తెలియపరిచినప్పుడు ప్రతి ఒక్కరూ సద్గురువులు మన జీవితంలోకి ఎందుకు వస్తారో తెలుసుకోవాలి? భగవంతుడు కృప ఉంటేనే సద్గురువులు మన జీవితంలోకి వచ్చి భగవంతుడు గురించి దారిని తెలియ జేస్తారు. అప్పుడు మీరు ఆ మార్గం గుండా పయనించడం మొదలు పెట్టినప్పుడు భగవంతుడు అనుగ్రహం మీమీద ఉంటుంది.

మీ చుట్టూ వాతావరణం ఎలా ఉండాలో భగవంతుడికి తెలుసు కాబట్టి అన్నీ మన ఎదుగుదలకు కావలసినవే వస్తాయి. ఒక్కొక్కసారి మీకు నచ్చని పరిస్థితులు కూడా మీ చుట్టూ వుంటాయి. మరి అటువంటప్పుడు మానవుడికి సహజంగా మనసు వల్ల రాగద్వేషాలు, శోక మోహాలు, మమకారాల వల్ల, ఏమిటి నేను ఇంత ఆరాధిస్తున్నా, ఇంత ధ్యానం చేస్తున్నా జీవితంలో నాకు పరిస్థితులు అనుకూలంగా లేవని అనుకుంటారు.

కానీ జ్ఞానం పెరిగే కొద్ది మీరు గ్రహించవలసిన విషయం ఏమిటంటే? మీ చుట్టూరా అనుకూల పరిస్థితులు కానీ, ప్రతికూల పరిస్థితులు కానీ, మీ ఎదుగుదలకే వస్తాయని మీరు గ్రహించగలిగితే మీకు జ్ఞానం వచ్చినట్టే లెక్క.

అందుకే బుద్ధుడు నీ ఎదురుగుండా సమస్యలు రాని, ఏది రాని అది నీ ఎదుగుదలకే వస్తాయి మరి దాన్ని స్వీకరించి అందులో నుంచి నువ్వు బయటపడడానికి ప్రయత్నించినప్పుడు నీ శక్తి పెరుగుతుంది అని చెప్పారు.

మహాత్ములందరూ కూడా భూమిమీద మానవుల కోసం ఎన్నో

సలహాలు, ఎన్నో సూచనలు ఇవ్వడం జరిగింది. మరి మీరు మార్గం తెలుసున్నాక ఆ మార్గం గుండా పయనించినప్పుడు మీ మనసుని సాత్వికంగా ఉంచుకోవాలి ఎందుకంటే సాత్వికంలోనే "సత్యాన్ని" తెలుసుకోవడానికి వీలవుతుంది.

ఆ సాత్వికమైన మనసు రావాలంటే ఆహార నియమాలు ఖచ్చితంగా పాటించాలి. ఎలాంటి ఆహారం తినాలి? హితకరమైనది, మితకరమైనది. అలాంటి ఆహారం అంటే శరీరానికి హితవు చేసే ఆహారం అది కూడా అతిగా తినకూడదు, మితంగా తినాలి. అలాగే మితనిద్ర అంటే నిద్ర కూడా ఎక్కువగా పోకూడదు, ఎంత పడుకోవాలో అంతే పడుకోవాలి.

అలాగే మితభాష మాట్లాడాలి. అంటే తక్కువ మాట్లాడడం వల్ల ఏమవుతుంది అంటే మీకు కర్మలు చాలా తక్కువ ఉంటాయి. అందుకే పత్రిగారు ఏమంటారు అంటే "నీ ప్రతిమాట నీకైనా ఉపయోగపడాలి లేదా నీ ప్రక్కవాడికైనా ఉపయోగపడాలి, ఉపయోగపడని ఒక్క మాట కూడా నీ నోటివెంట ఎప్పుడు రాకూడదు అంటారు."

ఇందులో అంతరార్థం ఏమిటంటే ఈ మాట మాట్లాడటానికి కూడా ఆత్మశక్తి ఖర్చు పెట్టాలి కాబట్టి, మాటలు కూడా జాగ్రత్తగా మాట్లాడగలగాలి. ఇలాంటి నియమాలన్నీ అలవాటు చేసుకుంటే కర్మలు తగ్గుతూ ఉంటాయి, శక్తి కోల్పోరు. సాత్వికంలో ఉంటారు కాబట్టి సాధన కుదురుతుంది, సత్యం దగ్గరికి చేరుకుంటారు.

మీకు భగవంతుడు మనసుతో పాటు, బుద్ధి అనేది కూడా ఇచ్చాడు కాబట్టి ఆ బుద్ధికి పదును పెట్టి వివేకాన్ని పెంచుకోవాలి. మీకు శంకరాచార్యుల వారు "నిత్య అనిత్య వస్తు వివేకం" అని చెప్పారు. మీకు ఏది అవసరమో అది తీసుకోవాలి. ఏది అవసరం లేదో అవి వదిలి పెట్టేయాలి.

ఇప్పుడు పొద్దున లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు గమనిస్తే మీకు సంబంధం లేని విషయాల్లో కూడా మీరు ఎక్కువగా దూరిపోయి వాళ్ళు అడగకపోయినా సలహాలు ఇస్తూ ఉంటారు. వాళ్ళు అడగనప్పుడు మీరు ఎందుకు మాట్లాడాలి అని ఒక్క క్షణం ఆలోచిస్తే మీరు ఎంతో శక్తిని, సమయాన్ని ఆదా చేసుకోవచ్చు.

అందుకే అక్కరలేని వాటిలో మీరు తలదూర్చి మీ శక్తిని ఖర్చు పెట్టకూడదు అని తెలుసుకోవాలి, ఆ వివేకం ఉండాలి. చూడండి చాలామంది పెద్ద వయసు వచ్చిన వాళ్ళు మాకు తోచట్లేదు అంటారు కానీ సాధన వాళ్ళ జీవితంలోకి వచ్చాక తోచట్లేదు అనే మాటకి బదులు మాకు టైం సరిపోవట్లేదు అనే మాట వస్తుంది.

ఎందుకంటే ఎంత టైం అయినా సాధన చేయొచ్చు, ఎంత టైం అయినా స్వాధ్యాయం చేయొచ్చు మరి ఈ రెండు ఉన్నప్పుడు మీకు తోచట్లేదు అని అనుకోరు. ఇప్పుడు గమనించండి ఎందుకు సాధన అని చాలామంది అడుగుతారు, కానీ మీకు తెలుసు! సాధన ఎందుకు అంటే మీరు ఎవరో తెలుసుకునే వరకు జన్మలు తప్పవు, మరి జన్మ ఉంటే దుఃఖము తప్పదు.

ప్రతి మనిషి దుఃఖం కోరుకోడు. అందరూ శాంతిగా, ఆనందంగా ఉండాలనుకుంటారు. మరి శాంతిగా ఆనందంగా ఉండాలి అంటే బాహ్యంగా తిరిగి ద్వైతంలో ఉంటూ జన్మని వ్యర్థం చేసుకుంటున్నాము అని ప్రతి ఒక్కరికీ తెలియాలి.

మీరు ఎంతసేపు బాహ్యదృష్టిలో వుంటారో అన్ని జన్మలు వ్యర్థం చేసుకున్నట్టే! అందరికీ తెలియట్లేదు బాహ్యంలో తిరిగితే జన్మ వ్యర్థం, అంతరంలోకి వెళ్తే జన్మకి మోక్షం. ఈ ఒక్క విషయం తెలిసుకున్నట్టే ఉంటుంది కానీ ఎవరికీ తెలియదు.

ఇప్పుడు పత్రిగారు భూమిమీదకు వచ్చారు అంటే మీ జీవితాల్లోకి మాత్రమే వచ్చారా? అందరికీ చెప్పారు. ధ్యానం వల్ల మోక్షము ఇదేం రహస్యంగా చెప్పలేదు. మరి అందరూ ఆచరించలేక పోతున్నారు. ఆచరించట్లేదు అంటే వాళ్ళకు జీవితంలో అప్పుడే మోక్షం పొందే అర్హత లేదు కాబట్టి ఈ సాధన ఆయన చెప్పినా ఆచరించలేకపోతున్నారు.

మరి అలా ఆచరించలేని వాళ్ళకి భగవంతుడు అనుగ్రహం ఎలా కలుగుతుంది? ఇప్పుడు తల్లిదండ్రులు చెప్పినట్టు బిడ్డ వింటేనే తల్లిదండ్రులు ఏదైనా సహాయం చేయగలరు. తల్లిదండ్రులు ఒక మాట చెప్తే బిడ్డలు వినకపోతే మరి తల్లిదండ్రులు వాళ్ళని ఎలా ప్రేమించగలరు? ఇలాంటివాడు నా కడుపున పుట్టాడు అని అనుక్షణం బాధపడతారు.

అలాగే ఆ పరమాత్మ, ఆ ఈశ్వరుడు మీ కోసం గురువును పంపినప్పుడు ఆయన చెప్పిన సాధన మీరు చేయకుండా భగవంతుడా! నా జీవితంలో దుఃఖం ఏంటి? కష్టం ఏంటి? శాంతి లేదు అని ఎన్ని రోజులు ఏడ్చినా లాభం లేదు. అవన్నీ పోగొట్టుకోవడానికే ఇలాంటి సాధన గురువులు చెప్పినప్పుడు, ఆ మార్గంలో ఉన్నప్పుడు మాత్రమే "ఈశ్వర అనుగ్రహం" కలుగుతుంది.

అందుకే భగవద్గీతలో "అనన్యా చింతయంతోమా" అని చెప్పారు. ఎప్పుడైతే నీ గురువు వచ్చి మరి భగవంతుడు ఆత్మ అని చెప్పినప్పుడు అన్ని చింతలు వదిలి నువ్వు ఆత్మ మీద చింతపెట్టినప్పుడు నిన్ను చూసుకునే బాధ్యత నేను తీసుకుంటాను అని చెప్పినప్పుడు కూడా నువ్వు ఆ సాధన చేయకుండా మాకు పూజలు అలవాటు, హోమాలు అలవాటు అని చెప్పి ధ్యానమే చేయకుండా పూర్వం నుంచి వస్తున్నవి అని చేస్తున్నప్పుడు మీ జీవితాల్లో మార్పు ఎప్పుడు ఉంటుంది? ఎక్కడ ఉంటుంది?

మరి భగవంతుడి కృప వల్ల గురువు రావచ్చు, అనుగ్రహం వల్ల నీ జీవితం మారొచ్చు. భగవంతుడు అనుగ్రహమే ఉంటే నీ జీవితంలో నువ్వు ఎంత గొప్పవాడివైనా కావచ్చు. ఆయన అనుగ్రహం లేకపోతే ఉన్న స్థితి నుంచి ఇంకా అద: పాతాళానికి దిగిజారిపోవచ్చు.

ఒక్కటే ధ్యానం చేయడమా? ధ్యానం వదలడమా? మానవ జన్మ ఉద్దేశ్యం సాధన చేసి తానెవరో తెలుసుకోవాలి. మరి అది నీకు తెలియనన్నాళ్ళు తెలియలేదు కానీ తెలియ చెప్పడానికి గురువు వచ్చాడు. మరి గురువు వచ్చినప్పుడు కూడా నువ్వు పట్టించుకోకుండా నాకు పూర్వం నుంచి అలవాటు అంటే ఎవరేం చేస్తారు.

భగవంతుడు కృప వల్ల నీకు గురువు వచ్చాడు అని ఎన్నో సందర్భాల్లో తెలుసుకున్నారు. తెలుసుకున్నది ఆచరణలో పెట్టుకోకపోతే నిన్ను బాగు చేసేవాడు ఎవడు? నిన్ను సృష్టించినవాడే నీ బాగు కోసం ఆలోచించాడు. నిన్ను కన్నవాళ్ళు కాదు ఆలోచించింది, నిన్ను భూమిమీదకు పంపినవాడు ఆలోచించాడు.

నీకు గురువుని ఇచ్చాడు, మార్గం చెప్పించాడు కానీ మీరు ఆ మార్గం గుండా నడవనప్పుడు ఈశ్వరానుగ్రహం ఎలా కలుగుతుంది? మీరు చేయవలసింది చేస్తేనే పొందవలసింది పొందుతారు అని ఎన్నో సందర్భాల్లో గురువులు చెప్తారు.

కోరేది ఏముంది? ఏం చెప్తున్నామో అది చేయండి చాలు! నువ్వు కోరాల్సిన అవసరం లేదు. నిన్ను సృష్టించిన వాడికి నీకు ఏమి ఇవ్వాలో, నీకు ఏం కావాలో ఆయనకి తెలుసు! నీ అర్హతను బట్టి వస్తాయి. ఏదైనా పుచ్చుకోవాలి అంటే సృష్టి నుంచి నీకు రావాలి అంటే నీకు స్వీకరించే అర్హత ఉండాలి.

ఇప్పుడు ఐఏఎస్ చదివినవాడు కలెక్టర్ అవుతాడు. కొంత చదివిన వాడు కలెక్టర్ కాలేదు కదా? మీరు కూడా అంతే! ఎంత సాధన చేస్తారో,

ఎంత జ్ఞానం పెచ్చుకుంటారో! దాన్ని బట్టే పొందేవి వుంటాయి.

బయట వెతకవలసింది ఏమీ లేదు! ఉన్నదంతా అంతరంలోనే ఉంది, ఆత్మలోనే ఉంది. ఈ ఆత్మ శక్తిని నువ్వు పెంచుకుంటే మనసు యొక్క శక్తిని తగ్గిస్తే మనసు ఆత్మలో లయమైనప్పుడు మనసుగా కాకుండా ఆత్మగా నువ్వు మిగిలిపోతే మరి పొందవలసినవన్నీ నువ్వు పొందగలవు.

అందుకే పత్రి గారు ఎప్పుడు చెప్పేవారు. ఏది కోరుకోవద్దు. చేయవలసిన ధ్యానం చెయ్యి రావలసినవన్నీ నీకు ఎప్పుడు రావాలో ప్రకృతి నీకు ఇస్తుంది అంటే ఒక్కటే గుర్తు మీ మీద "ఈశ్వర అనుగ్రహం" ఉన్నట్లే.

మరి అష్టసిద్ధులు పొందినవాళ్ళు ఎంతోమందిని చూసాం. సాధన ద్వారా పొందారు కానీ పూజ ద్వారా కానీ తీర్థయాత్రలు, నోములు, వ్రతాల వల్ల యజ్ఞ యాగాదుల వల్ల ఈ సిద్ధులు ఎవ్వరు పొందలేదు. అందుకే ప్రతి ఒక్కరు గ్రహించవలసింది ఏది పొందాలి అన్నా అంతర్ముఖం అవ్వాలి, ఆత్మని తెలుసుకోవాలి.

'ఆత్మ'లోనే అన్ని ఉన్నాయి, అనంతమైన శక్తి కలది 'ఆత్మ'. దానికి మనసు అనే ముసుగు వేసి ఆత్మను తెలుసుకోవట్లేదు. మనసు యొక్క ప్రాధాన్యత తగ్గించినప్పుడు మరి ఆ ప్రాధాన్యత మనకి ఎప్పుడు తగ్గుతుంది అంటే ధ్యానం చేసినప్పుడు.

ఎందుకంటే "విషయ సేకరణ" కళ్ళతో చూస్తే ఎక్కువ ఉంటుంది. ఆ విషయాలను సేకరించడం మానాలి అంటే కళ్ళు మూసుకుని అంతర్ముఖం అవ్వాలి. ఎప్పుడైతే కళ్ళు మూసుకుని అంతర్ముఖంగా పయనిస్తారో అప్పుడు విషయ సేకరణ తగ్గుతుంది.

కళ్ళ వల్ల ఎన్నో విషయాలు సేకరిస్తారు, చెవులతో ఎన్నో వింటున్నారు మరి ఈ రెండిటికి పని తగ్గించి ఎప్పుడైతే మీ ప్రయాణం, మీ దృష్టి ఆత్మ వైపు మళ్ళుతుందో ఎప్పుడు అన్వేషణ ప్రారంభం అవుతుందో అప్పుడు

పొందవలసినవి పొందుతారు.

మీరు చేసిన సాధనను బట్టి, పొందిన జ్ఞానాన్ని బట్టి, మీ అర్హతను బట్టి మీకు రావలసింది ఉంటుంది. అందుకే బాహ్యంలో ఏ కోరిక కావాలన్నా పూజలు, అష్టోత్రాలు ఇవి అవి చేసేసి కోరికలు కోరతారు కానీ అవి వస్తాయా? రావా? అంటే ఖచ్చితంగా రావనే చెప్పాలి.

ఏవైనా వచ్చాయి అంటే నీ పుణ్యకర్మ వల్ల కొంచెం రావచ్చు కానీ అంతర్ముఖమైన వాళ్ళే సిద్ధులు, శక్తులు పొందుతున్నారు.

అందుకే మహా పాపాత్ములైన రాక్షసులు కూడా ధ్యానం చేసే శక్తుల్ని పొందేవారు కానీ బయట కూర్చుని పూజలు చేసి నాకు అది కావాలి, ఇది కావాలని కోరలేదు. వాళ్ళు కూడా తెలివైనవాళ్ళు కలియుగంలో మానవుల కంటే మహా పాపాత్ములైన రాక్షసులకే తెలివి ఎక్కువ ఉందని దీన్నిబట్టి అర్థమవుతుంది.

ఈ కలియుగంలో మానవులు గుడికెళ్ళి పూజ చేస్తారు, ఇంట్లో పూజ చేస్తారు. మాకు చాలా వచ్చేస్తాయి అనుకుంటారు. ఆ కథల పుస్తకాలలో కూడా అలాగే ఉంటాయి మరి అవి చూసి ఇంకొంచెం మూర్ఖత్వంలో, మూఢత్వంలో దిగిపోతున్నారు కానీ మహానుభావులు భూమిమీదకి వచ్చి సాధన యొక్క విలువ, సాధన యొక్క గొప్పతనం చెప్తున్నా తెలియలేనంత మూర్ఖత్వంలో ప్రజలు వున్నారు.

కానీ అలా అయిన వాళ్ళని మనం వదిలేసినా మనలాంటివాళ్ళు అంటే ధ్యానం విలువ, జ్ఞానం విలువ, ఆత్మ విలువ తెలుసుకుంటూ మరి ఇంకా ముందుకుపోవాలి. మీరు విషయాసక్తి ఎంతగా తగ్గించుకుంటారో! ఆత్మాసక్తి అంతగా పెంచుకుంటారు.

విషయ ఆసక్తి ఉన్నవాడికి ఈశ్వర అనుగ్రహం ఉండదు, ఆత్మ ఆసక్తి ఉన్నవాడికే ఈశ్వర అనుగ్రహం ఉంటుంది. మరి గీతలో అదే చెప్తాడు

కదా! అన్ని చింతలు వదిలిపెట్టి నా మీద చింతపెట్టిన వాడి చింతలు నేను తీరుస్తాను. భగవంతుడి మీద చింత పెట్టిన వాడికి చింతలు తీరుతాయి కానీ భగవంతుడి సృష్టి మీద చింత పెట్టిన వాడికి చింతలు తీరవు అని దీన్నిబట్టి అర్థమవుతుంది.

అందుకే ప్రతిఒక్కళ్ళు ఇది తెలుసున్నట్టు ఉంటుంది కానీ పదే పదే భగవంతుడు అనుగ్రహం నాకు కలగాలి అంటే నేను "త్రికరణ శుద్ధిగా" గురువు చెప్పిన మాటని పాటించాలి, ఆయన చెప్పిన సాధన చేయాలి, ఆయన చెప్పిన జ్ఞానాన్ని బుద్ధిలో ఇంకించుకోవాలి.

గురువు ఏం చెప్పాడు అంటే నువ్వు శరీరం కాదు ఆత్మవి అని చెప్పాడు. అనుక్షణము నేను ఆత్మని అనే ఎరుకలో ఉండగలిగితే మీరు జీవులు కాదు దేవుళ్ళే! అప్పుడు మీ ప్రవర్తనే మారిపోతుంది. ఎప్పుడైతే నేను జీవుడిని అనుకుంటే కోరికలు బంధాలు మీ చుట్టూరా వచ్చేస్తాయి. ఎప్పుడైతే నేను దేవుడిని అనుకుంటారో ఒక్కొక్క దాని నుంచి విడిపోతారు.

ప్రతి మనిషి ఆత్మలో ఐక్యమయ్యే వరకు ఈ బంధాలు ఉంటూనే ఉంటాయి. మీ దృష్టి బాహ్య దృష్టి అయినప్పుడు తప్పనిసరిగా బంధాలు ఉంటాయి. అప్పటివరకు మీరు ఏమంటారు అంటే మీరు బాహ్య దృష్టిలో ఉంటే ఏదివచ్చినా తప్పదు కదా! చేయాలి కదా! అంటూ ఉంటారు. ఎప్పుడైతే మీ దృష్టి అంతర్దృష్టి అయిందో ఒక్కొక్క బంధాన్ని వదులుకుంటూ వదులుకుంటూ భగవంతుడితోటే బంధం గట్టిగా ఏర్పరచుకుంటారు.

ఇదే తేడా! మీ దృష్టి బాహ్య దృష్టి ఉంటే బంధాల్లో ఉంటాం. బంధాలు ఎలా ఉంటాయి అంటే విడదీయలేనంత గట్టిగా ఉంటాయి. అందుకే మీరు కొన్ని విషయాల్లో తప్పదు కదా అంటూ ఉంటారు అంటే అవి మానలేము అనుకుంటారు. అవి అంత గట్టిగానే కనిపిస్తాయి.

కానీ అంతర్ముఖమైన వాళ్ళకి ఈ బంధాలు వాళ్ళు వదలరు, భగవంతుడే వదిలిస్తూ ఉంటాడు. మెల్లి మెల్లిగా నీ దృష్టి అంతర్దృష్టి అయినప్పుడు నీకు భగవంతుడు అనుగ్రహం ఉంటే ఆయనతో నువ్వు బంధం గట్టిగా ఏర్పరచుకుంటే బాహ్య బంధాలన్నీ కూడా ఆటోమేటిక్‌గా మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతాయి. అది భగవంతుడి యొక్క నిర్ణయం, ఇదే ఈశ్వర అనుగ్రహం.

వారు ఒకప్పుడు ఏమనుకుంటారు అంటే? ఎవరిని వదలగలము అనుకుంటూ ఉంటారు, కానీ నీకు తీవ్రాతి తీవ్ర తపన భగవంతుడి మీద ఉంటే అంటే ఆత్మమీద ఉంటే నేను ఈ జన్మే చివరి జన్మ చేసుకోవాలి.

అంత సాధన, అంత జ్ఞానం నాకు కలగాలి, నా మనసు ఆత్మ వైపే ఉండాలి, నా బుద్ధి జ్ఞానంలోనే ఉండాలి అని తీవ్రాతి తీవ్రంగా తపన పడుతుంటే ఆ గురువు ఇచ్చిన సాధనని చేసుకుంటూ ప్రాపంచిక విషయాలు పట్టించుకోకుండా విషయాసక్తి తగ్గించుకుని ఆత్మాసక్తిని పెంచుకున్నప్పుడు మీకు తప్పకుండా ఈశ్వర అనుగ్రహం కలుగుతుంది.

ఈశ్వరానుగ్రహం కలగడం అంటే బాహ్యంగా ఉన్న బంధాల నుంచి మీకు తెలియకుండానే విముక్తి కలుగుతుంది. ఆత్మతో ఎంత గట్టి బంధం ఏర్పరచుకుంటారో బాహ్య బంధాలు అంత చక్కగా విడుదల అయిపోతూ ఉంటాయి.

ఇంకా అంతకంటే కావలసింది ఏముంది? ప్రతి ఒక్కరు వదులు కోవాలని అనుకోనక్కరలేదు మరి అవే పోతాయి. వదిలేయాలని అవతలవాళ్ళని బాధ పెట్టకూడదు. నీకు ఎంతగా ఆత్మ మీద, భగవంతుడి మీద ఇష్టం పెరుగుతుందో ఈ సాధన తీవ్రతరమవుతుంది.

అందుకే జన్మని వ్యర్థం చేసుకోవడం అంటే ఈ జన్మలో ధ్యానం తెలిసినా చేయకపోవడం, జ్ఞానం పెంచుకోకపోవడం దానిగురించి కృషి చేయకపోవడమే జన్మని వ్యర్థం చేసుకున్నట్లు.

ఎవరైతే తెలుసున్న దగ్గర నుంచి సాధన చేసి జ్ఞానం పెంచుకుంటూ ఉంటారో వాళ్ళు జన్మని సార్ధకత చేసుకున్నట్టు. తెలుసున్నా చేయకపోవడం వ్యర్థం చేసుకోవడం, తెలిసున్న దగ్గర నుంచి ఆచరించడం సార్ధకత చేసుకోవడం మరి "తనకోసం తప్పించే వాళ్ళకే కదా ఈశ్వరుడు అనుగ్రహం ఉంటుంది."

మరి తనకోసం తపించని వాళ్ళ పైన అనుగ్రహం ఎందుకు చూపించాలి? అందుకే ఈశ్వర అనుగ్రహం మీకు రావాలి అంటే గురువు చెప్పిన సాధన చేయాలి, గురువు చెప్పిన జ్ఞానాన్ని నిరంతరము పెంచుకోవాలి. ఎందుకు సాధన చేయాలి అంటే ఒక విషయం తెలుసుకున్నాక ఆ విషయాన్ని మర్చిపోయి పక్కన పెడుతూ ఉంటారు కానీ అలా మర్చిపోకుండా ఉండాలి మనసు ఆత్మ వైపు తిరిగే ఉండాలి.

అలా తిరిగినప్పుడే అది అందులో నుంచి శ్రద్ధగా ముందుకు వెళ్ళిపోతుంది. అందుకే బాహ్య విషయాల్లో ఉంటే మనసు స్థూలమవుతుంది. అంతర్ముఖమైనప్పుడు మనసు సూక్ష్మం అవుతుంది. సూక్ష్మమైన మనసే ఆత్మలో లయం అవ్వగలదు. అందుకే ఇవన్నీ తెలుసుకోవాలి.

చిన్న చిన్న విషయాలు తెలుసున్నట్టే ఉంటాయి కానీ ఆ చిన్న చిన్న పొరపాట్లు చేస్తూ మీరు ముందుకు ఎదగలేరు. అందుకే జ్ఞానం అనంతం అంటారు. ఎన్ని నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవాల్సినవి ఉంటూనే ఉంటాయి.

అందుకే నేర్చుకున్న విషయాలకు అహంకారం పెంచుకోకుండా ఇంకా నేర్చుకోవాలనే వినయం ఉన్న సాధకుడు ఎంతో ముందుకు వెళ్తాడు. ఆ ఈశ్వర అనుగ్రహం పొందిన సాధకుడు చక్కగా అదే చివరి జన్మ చేసుకోగలుగుతాడు. అందుకని ఈశ్వర అనుగ్రహం కోసం ప్రయత్నించాలి అంటే నిరంతరము సాధన, స్వాధ్యాయము, సజ్జన సాంగత్యము చేయాలి.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.130/- |
| 4) సత్యమార్గం | - | రూ.160/- |
| 5) ధ్యాన శక్తి | - | రూ.130/- |
| 6) ధ్యాన శాస్త్రం | - | రూ.130/- |
| 7) ఆత్మ శాస్త్రం | - | రూ.120/- |
| 8) మరణించక ముందే మరణించాలి | - | రూ.130/- |
| 9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.120/- |
| 10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - | రూ.120/- |
| 11) ఉపమాన ధ్యాన సందేశాలు | - | రూ.110/- |
| 12) జీవిత సూక్ష్మాలు | - | రూ.100/- |
| 13) భగవంతుడంటే | - | రూ.100/- |
| 14) తెలుసుకోండి | - | రూ.100/- |
| 15) మెహర్‌బాబా సందేశాలు | - | రూ.100/- |
| 16) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు | - | రూ.100/- |
| 17) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? | - | రూ.100/- |
| 18) కోరికల వల్ల నష్టాలు | - | రూ.100/- |
| 19) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు | - | రూ.100 |
| 20) కఠోపనిషత్తు | - | రూ.90/- |
| 21) ఉపమాన జ్ఞాన సందేశాలు | - | రూ.90/- |
| 22) గీతాసందేశం | - | రూ.80/- |
| 23) ముఖ్యమైన సందేశాలు-1 | - | రూ.80/- |
| 24) ముఖ్యమైన సందేశాలు-2 | - | రూ.90/- |
| 25) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 26) ధ్యానమంటే ? | - | రూ.80/- |
| 27) త్రివిధాలు | - | రూ.80/- |
| 28) ఉత్తమ పురుషుడు | - | రూ.80/- |
| 29) పత్రీజీ జ్ఞాన సందేశాలు-1 | - | రూ.80/- |
| 30) పత్రీజీ జ్ఞాన సందేశాలు-2 | - | రూ.80/- |
| 31) పత్రీజీ జ్ఞాన సందేశాలు-3 | - | రూ.90/- |
| 32) వశిష్ఠుల వారి సందేశాలు | - | రూ.70/- |
| 33) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.70/- |
| 34) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 35) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 36) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 37) మరణం తర్వాత కూడా వచ్చేవి | - | రూ.70/- |
| 38) షిరిడీ సాయి సందేశాలు | - | రూ.70/- |
| 39) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.70/- |
| 40) బుద్ధుని సందేశాలు | - | రూ.70/- |
| 41) భూతదయే దైవత్వం | - | రూ.70/- |
| 42) ఆత్మహంతకులంటే ఎవరు? | - | రూ.70/- |
| 43) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి | - | రూ.70/- |
| 44) ధర్మ సూక్ష్మాలు | - | రూ.70/- |
| 45) ఆశ్చర్యకరమైన విషయాలు | - | రూ.70/- |
| 46) మానవునిలోని చెడు | - | రూ.70/- |
| 47) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు | - | రూ.70/- |
| 48) చివటం అమ్మవారి సందేశాలు | - | రూ.70/- |
| 49) మోక్షం అంటే? | - | రూ.70/- |
| 50) కబీరు సందేశాలు-1 | - | రూ.70/- |
| 51) మనసు-1 | - | రూ.70/- |
| 52) మనసు-2 | - | రూ.70/- |
| 53) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " | | రూ.70/- |
| 54) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే | - | రూ.70/- |
| 55) మరణానంతరం జరిగేది-1 | - | రూ.60/- |
| 56) మరణానంతరం జరిగేది-2 | - | రూ.70/- |
| 57) ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు | - | రూ.70/- |
| 58) మరణానంతరం జరిగేది-3 | - | రూ.60/- |
| 59) కబీరు సందేశాలు-2 | - | రూ.60/- |
| 60) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 61) బ్రహ్మజ్ఞానం | - | రూ.60/- |
| 62) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 63) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 64) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 65) ఆలోచించండి | - | రూ.60/- |
| 66) నిర్వాణ మార్గం | - | రూ.60/- |
| 67) ధ్యానులకు సూచనలు | - | రూ.60/- |
| 68) యోగీశ్వరుల సందేశాలు | - | రూ.60/- |
| 69) మమకారం | - | రూ.60/- |
| 70) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 | - | రూ.60/- |
| 71) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 | - | రూ.50/- |
| 72) మాస్టర్‌గా ఎదగాలంటే? | - | రూ.50/- |
| 73) భగవంతుని ఇష్టులవ్వాలంటే | - | రూ.50/- |
| 74) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 75) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.50/- |
| 76) మూడురకాల భవిష్యత్తులు | - | రూ.50/- |
| 77) అరిహంత్ | - | రూ.50/- |
| 78) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన | - | రూ.50/- |
| 79) ఈ జీవితం ఎందుకు? | - | రూ.40/- |
| 80) భార్యభర్తలు గొడవ పడకూడదంటే | - | రూ.40/- |
| 81) విదురుని సందేశాలు | - | రూ.40/- |
| 82) మూడురకాల జీవితాలు | - | రూ.40/- |
| 83) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - | రూ.40/- |
| 84) ఛాంపియన్ అవ్వాలంటే? | - | రూ.40/- |
| 85) బ్రహ్మం అంటే? | - | రూ.40/- |
| 86) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం | - | రూ.40/- |
| 87) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం | - | రూ.40/- |
| 88) మహాత్ముల సందేశాలు | - | రూ.40/- |
| 89) సత్యం | - | రూ.40/- |
| 90) చక్రాలు | - | రూ.40/- |
| 91) గురువును గుర్తించడం ఎలా? | - | రూ.40/- |
| 92) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 93) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 94 )మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 95) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 96) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |



సాధకులకు మొదట ఉండవలసింది ఈశ్వరుని కృప, అంటే భగవంతుని కృప. భగవంతుని కృప ఉంటేనే ధ్యాన మార్గంలోకి రాగలరు. మీరందరూ సాధన చేస్తున్నారు, జ్ఞానాన్ని పొందుతున్నారు. అయినా ఇంకా ఇంకా నేర్చుకోవాల్సి ఉంది. అయితే ఈ నేర్చుకునే విధానంలో అయినా మీకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉండాలంటే ఈశ్వర అనుగ్రహం ఉండాలి. మరి ఆ విధంగా ఈశ్వరానుగ్రహం మీపై ఎప్పుడూ ఉండాలి అంటే, ఈ సాధన మార్గంలో మీరు ఇంకొంచెం జాగ్రత్తగా మీ వాక్కు, ప్రవర్తనను ఉంచాలి. పరమాత్మ పట్ల, ప్రకృతి పట్ల, గురువు పట్ల మీరు వినమ్రతతో ఉండాలి. “సర్వ జీవుల సేవే సర్వేశ్వరుని సేవ” అని తెలుసుకోవాలి. మితాహారమే మనిషికి సరైన ఆహారం. అలాగే మిత భాషణం అంటే తక్కువగా మాట్లాడాలి, వీలైనంత వరకు మౌనం పాటించాలి. మితంగా నిద్రపోవాలి. “నేను శరీరం కాదు కదా, నేను ఆత్మను” అని పదే పదే గుర్తు చేసుకోవాలి.

భగవంతుని అనుగ్రహం చిట్ట చివరి వరకు మీపై ఉండాలి అంటే, మీరు ఏ చిన్న ప్రలోభానికీ లొంగకూడదు. అరిషడ్వర్గాలు మీ అదుపులో ఉండాలి కానీ మీరు అరిషడ్వర్గాలకు బానిస కాకూడదు. అరిషడ్వర్గాలకు మీరు బానిస కాకుండా ఉంటే భగవంతుని దగ్గరకు తొందరగా చేరగలరు.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.50/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|